తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక వార్త
30 వార్త వార్షికోత్సవం 1996 - 2026

## నసియాలలో
# ఒంటరి ఏనుగు సంచారం



రామకుప్పం, మార్చి 15ప్రభాతవార్త
మండలంలోని ననియాల అటవీ సమీప ప్రాంతంలో ఒంటరి ఏనుగు సంచరిస్తోంది. శనివారం రాత్రి పంట పొలాలవైపు వచ్చేయత్నం చేసింది. అటవీ సిబ్బంది ఏనుగును అటవీ లోతట్టు ప్రాంతానికి తరిమేందుకు టపాకాయలు పేల్చారు. కాగా నారాయణపురం తాండా, పంద్యాలమడుగుతాండా, రామాపురం తాండా, పచ్చారమాకులపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో రైతులు రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లరాదని అటవీ అధికారులు సూచించారు.

## మే 5,6 తేదీల్లో
# పోలేరమ్మ జాతర



నాయుడుపేట, మార్చి 15, ప్రభాతవార్త
నాయుడుపేట గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మే ఐదు, ఆరు తేదీల్లో జరగనుందని కార్యనిర్వహణ అధికారి ఈవో నవీన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 6 గంటలకు విన్నమాల పెద్దకాపు అరవ భూమి శ్రీనివాసులు రెడ్డికి ఆలయ వ్యవస్థాపక వారసులు నల్లబోతుల రామారావు ఆలయ చైర్మన్ నానబాల సుబ్బారావు ఆధ్వర్యంలో నాయుడుపేట పెద్దలు తాంబూలం అందించారు. ముందుగా దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్తులు విన్నమాల గ్రామంలోని పెద్ద కాపు ఇంటికి చేరుకున్నారు. జాతరలో ఎటువంటి అవాంతరాలు లేకుండా జాతర జరిపించవలసిందిగా అరకు శ్రీనివాసులు రెడ్డి గ్రామ పెద్దలు కోరారు. అనంతరం తాంబూలం ఇచ్చి స్వాగతం పలికారు. ఈనెల 17వ తేదీన మొదటి చాటింపు ప్రక్రియతో జాతర ప్రారంభమవుతుందని వారు తెలిపారు. మూడుసార్లు చాటింపు ప్రక్రియ పూర్తిచేసుకుని మే 5వ తేదీ రాత్రి గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి నిలుపు మే ఆరో తారీఖున జాతర జరుగుతుందని వారు తెలిపారు. మే మూడవ తేదీన ఉదయం నుంచి పట్టణంలో ఘట్టం ప్రక్రియ ప్రారంభమవుతుందని వారు తెలిపారు. పట్టణ ప్రజలు జాతరలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల కుబేరు మణి శేషగిరి, గుంటూరు లక్ష్మయ్య, చిరంజీవి ఆచారి నల్లపోతుల అంజయ్య, చేపల వెంకటేశ్వర్లు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో పాటు కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లాలో రైతన్నా మీకోసం..
## జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, మార్చి 15 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం సూచనలతో జిల్లాలో మార్చి 16 నుండి 18 వరకు అలాగే 23 నుండి 25 తేదీ వరకు రైతన్నా మీకోసం కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న రైతన్నా మీకోసం కార్యక్రమం ఏర్పాట్ల పై వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో వ్యవసాయ శాఖ జేడి ఎస్.ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతన్నా మీకోసంలో భాగంగా వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ స్థాయి అధికారులు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు గురించి తెలియజేస్తూ కరపత్రాలను పంచాలన్నారు. ప్రతి రైతు మొబైల్ నందు ఏపీ ఎయిమ్స్ యాప్ ని ఇన్స్టాల్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు పండించే పంటకు వచ్చే చీడపీడల గురించి, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ రెట్లు, ఈ పంట నమోదు, తదితర సమాచారం తెలుసుకునే విధంగా ఈ యాప్‌ని రూపకల్పన చేయడం జరిగిందన్నారు. కావున రైతులందరూ దీనిని ఉపయోగించుకునేలా సూచనలు ఇవ్వాలన్నారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పిఎండిఎస్ కిట్లు విరివిగా ఉపయోగించాలని రైతుల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. ప్రతి అధికార బృందం గ్రామంలో రోజుకు విధిగా 90ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించాలని తెలిపారు.

# తిరుపతిలో రాజకీయ కులచిచ్చు!
## -స్థానిక ఎన్నికలకు ముందే పరిస్థితులు దారితప్పుతాయా!?

ప్రభాతవార్త-తిరుపతి:
రాజకీయాలకుకేంద్రబిందువుగా మారిన తిరుపతి నగరంలో కులచిచ్చు రచ్చ రోడ్డుపైకి చేరుతుందా...ఇప్పటివరకు అన్ని కులాలు సమన్వయంతో నడుస్తున్న బాటలో ముళ్ళపాన్పులు పరచుకుంటా...అనే అనుమానాలు రాజకీయ విశ్లేషకుల్లో మొదలైంది. సాధారణంగా ఎన్నికల సమయంలోనే రాజకీయంగా పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ ప్రాబల్యం చాటుకుంటుండటం జరుగుతుంది. ఆ తరువాత కొద్దిరోజులకు అందరూ ఒకటిగా మెలగడం కనిపిస్తుంది. అందుకు భిన్నంగా ఇప్పుడు తిరుపతిలో రాజకీయంగా కులచిచ్చు రేపడానికి ఓ పార్టీలోని వర్గం వ్యూహాన్ని అమలు చేసి తమవారితో పబ్బం గడుపుకునేందుకు పావులు కదుపుతున్నారనే విమర్శలు జోరుగా మొదలయ్యాయి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ముందే తిరుపతి ప్రశాంతతకు భంగం వాటిల్లేలా బలిజ సామాజికవర్గం, యాదవ సామాజిక వర్గానికి మధ్య రచ్చ పెట్టి ఓ పార్టీ వేడుకచూసేందుకు సిద్ధమైందని కూటమి పార్టీల్లో గుసగుసలు మొదలయ్యాయి. తిరుపతి నియోజకవర్గంలో బలిజ సామాజిక వర్గం ఓటుబ్యాంకు ఎక్కువ. ఆ తరువాత యాదవులు,రెడ్డి వర్గానికి చెందిన ఓటర్లు ఉన్నారు. తిరుపతిలో తొలినుండి బలిజ సామాజిక వర్గం బలపరిచే నాయకుడే ఎమ్మెల్యేగా, ఇతర కీలక పదవులును కైవశం చేసుకుంటున్నారు. ఆ తరువాత యాదవ సామాజిక వర్గం రాజకీయంగా నిలదొక్కుకుంది. ఓ పార్టీ నేతలు బలిజ,యాదవ వర్గాల మధ్య కులచిచ్చు



రేపేందుకు పలు రకాలుగా తంటాలు పడుతున్నారనేది నగరంలో హాట్‌టాపిక్. ఇప్పటికే జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్‌పైన యాదవవర్గానికి చెందిన కొందరు మహిళలతో రాజకీయంగా తిట్లదండకం మొదలైంది. యాదవ వర్గానికి చెందిన వాళ్ళు ఆ పార్టీకి విధేయులుగా ఉంటూ ఆ నేత చెప్పిందే వేదంగా యుద్ధంలోకి దిగుతున్నారనేది జనంలో చర్చ. ఏకంగా కులాల పేరుతోనే ఈ రగడ మొదలవడం ఎక్కడకు దారితీస్తుందోనని రాజకీయ విశ్లేషకులు అంతర్మథనం చెందుతున్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక డొంక తిరుగుడు దారుల్లో పార్టీల మధ్య రచ్చకు కారణమైన వారిని తిరుపతి జనం చీ కొట్టేరోజులు లేకపోలేదని కూటమి పార్టీల నేతలు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. మరీ స్థానిక ఎన్నికలకు ముందే పరిస్థితిని చక్కబెట్టడం తప్పదని విశ్లేషకుల అంచనా.

# నేటి నుండి పది పరీక్షలు

- ◆పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు
- ◆129 కేంద్రాల్లో హాజరు కానున్న 23,095 మంది విద్యార్థులు
- ◆12 సమస్యాత్మక కేంద్రాలపై సిసి కెమెరా కన్ను
- ◆ పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు
- ⑩⑩⑩జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్



చిత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త:
జిల్లాలో సోమవారం నుండి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలను పకడ్బందీ నిర్వహణకు జిల్లా విద్యాశాఖ పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసింది. టెన్త్ పరీక్షల నిర్వహణలో ఎక్కడైనా నిర్లక్ష్యం ప్రదర్శించడం, మాస్ కాపీయింగ్‌కు పాల్పడటం వంటివి జరిగితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. జిల్లాలో మార్చి 16 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరుగనున్నా యన్నారు. టెన్త్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 129 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో ఎ కేటగిరి పరీక్షా కేంద్రాలు 44, బి కేటగిరి పరీక్షా కేంద్రాలు 41, సి కేటగిరి పరీక్షా కేంద్రాలు 43 వున్నాయన్నారు. ఈ సంవత్సరం టెన్త్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 23,095 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, అందులో 12,095 మంది బాలురు, 10,990 మంది బాలికలు వున్నారన్నారు. అలాగే అదనంగా మరో 19 పరీక్షా కేంద్రాల్లో 1,063 మంది విద్యార్థులో ఓపెన్ స్కూల్ విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను ఉదయం 10 గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందన్నారు. టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అడ్డుకట్ట వేయడానికి జిల్లా వ్యాప్తంగా 9 ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశామన్నారు. టెన్త్ పరీక్షల నిర్వహణ కోసం 129 మంది చీఫ్ సూపరిటెండెంట్లు, 129 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 12,010 మంది ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో 12 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను గుర్తించి ఈ కేంద్రాల్లో పరీక్షలకు పకడ్బందీగా నిర్వహించడానికి సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల హాల్‌టిక్కెట్లలో క్యూఆర్ కోడ్ ముద్రించడంతో సాంకేతిక సదుపాయం మరింత అందుబాటులోకి వచ్చిందన్నారు. విద్యార్థుల హాల్‌టికెట్‌ను స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం చిరునామా, ఇతర పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశం వుంటుందన్నారు. అలాగే టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో హాల్‌టిక్కెట్ చూపి పరీక్షా కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణం చేయవచ్చునన్నారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144 సెక్షన్ అమలులో వుంటుందన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో టెన్త్ పరీక్షలు పూర్తయ్యే వరకు జెరాక్స్ సెంటర్లు మూసి వేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.

# కదలిన ఉచిత బస్సు : ప్రసాదాల అందుబాటుపై ప్రత్యేక శ్రద్ధ

శ్రీకాళహస్తి,మార్చి 15 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా సుమారు 10 రోజుల ముందు బాధ్యతలు స్వీకరించిన బికే వెంకటేశు ఆలయంలో గతంలో నిర్లక్ష్యానికి గురైన పలు అంశాలను గుర్తించారు. ఈనేపథ్యంలో భక్తుల మనోభావాలకు అనుగుణంగా పలు మార్పులు చేర్పులు చేపడుతున్నారు. ఆయన స్వయంగా ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఆ సమస్యకు సంబంధించి ఆలయ సిబ్బందితో చర్చించి పరిష్కారానికి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఆలయానికి సంబంధించి రైల్వేస్టేషన్, బస్సు స్టేషన్‌ల వద్దకు వచ్చే భక్తుల సౌకర్యార్థం లక్షలు వెచ్చించి 'ఉచిత బస్సులను' ఏర్పాటు చేసారు. అయితే పర్యవేక్షణ లేక ఆ బస్సులను ప్రత్యేక షెడ్డులు వేసి భరద్వాజ తీర్థంలో పార్కింగ్ చేసి ఆ వాహనాలకు సంబంధించి డ్రైవర్లకు జీతాలు చెల్లిస్తుండటం గమనించారు. వెంటకే దానికి సంబంధించి ఆలయ ఉద్యోగులతో చర్చించారు. వెంటనే ఆ బస్సులను భక్తులకు ఉపయోగపడే రీతిలో స్పందించారు.

**ఉచిత బస్సు గమనానికి ప్రణాళిక:**
శ్రీకాళహస్తీశ్వరాలయం నడిపే ఉచిత బస్సు టైమింగ్స్‌ను ఖరారు చేసారు. ఆలయ ఇఓ వెంకటేశు అందించిన సమాచారం మేరకు ఉచిత బస్సు ఉదయం 3 గంటల నుంచి 8గంటల వరకు సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8గంటల వరకు కైలాస సదనం, గంగా సదన్ నుంచి బయలు దేరి నాలగవ గేటు, రైల్వే స్టేషన్, వరదరాజస్వామి అతిథి గృహం, ఆర్‌టిసి బస్టాండ్,భక్త కన్నప్ప సదన్,



1వ గేటు, నాల్గవ గేటు,కైలాస సదన్, గంగా సదన్‌ల కు చేరాలి. అలాగే ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు కైలాస సదన్, గంగా సదన్, నాల్గవ గేటే, 1వ గేటు, ఆర్‌టిసి బస్టాండ్‌లోపలకు వియంసి సర్కిల్, భక్తకన్నప్ప సదన్, 1 వ గేటు, 4వ గేటు, కైలాససదన్,గంగా సదన్‌లకు నడపాలని సిబ్బందికి ఆదేశాలు జారి చేసారు. ఈమేరకు ఆదివారం నుంచి బస్సుల నడక ప్రారంభమైంది.

**గ్యాస్‌కంపెనీలతో చర్చ: సరఫరాతో ప్రసాదాలు:**
ఇటీవల ఏర్పడిన గ్యాస్ కొరత సమస్యతో స్పందించిన ఇఓ బికే వెంకటేశు తనకున్న పరిచయాలతో ఐఒసి అధికారులతో చర్చించారు. అలాగే హెచ్‌పి గ్యాస్

## పరిపాలనలో సంస్కరణలకు ఇఓ శ్రీకారం

డీలర్లతో చర్చించారు. దాంతో ఐఒసి నుంచి కావాల్సినంత గ్యాస్‌ను సరఫరా చేస్తున్నారు. ఒక్కసారిగా 50సిలిండర్లను సరఫరా చేస్తున్నారు.దాంతో ప్రసాదాల తయారికి ఎలాంటి అడ్డంకి లేకుండా భక్తులు కోరినన్ని ప్రసాదాలను తయారు చేస్తున్నారు.అంతేకాక గ్యాస్ పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రత్యామ్నాయంగా కట్టెల పొయ్యలను కూడా సిద్ధం చేయించారు.కానీ శివయ్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గించకూడదని ఐఒసి అధికారులుతో పాటు స్థానిక గ్యాస్ ఏజెన్సిలు ముందుకు రావటంతో సమస్య పరిష్కారమైంది.ప్రసాదాలు నిత్యాన్నదాన పథకానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా జరుగుతుంది.అంతేకాక ఒక్కొక్క సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

**రూ.200 టిక్కెట్లు అందుబాటులోకి . . .**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన టిక్కెట్లు, సేవల టిక్కెట్లు జారి కౌంటర్లను ఒకే చోట ఏర్పాటు చేసారు.అయితే ఇక్కడకు వచ్చిన భక్తులు ప్రత్యేకదర్శనం టిక్కెట్లు కొసం పడుతున్న ఆగచాట్లను గుర్తించిన ఇఓ బికే వెంకటేశు అధికారులతో చర్చించారు. రూ.200 టిక్కెట్లు కోసం భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయంలోని 16కాళ్ళ మండపం వద్ద ఆదివారం కౌంటర్‌ను ఏర్పాటు చేసారు.దాంతో ఆదివారం భక్తులు ఎంతో సౌకర్యంగా ఉపయోగించుకున్నారు.

# కన్నుల పండువగా పుష్పయాగ మహోత్సవం



చంద్రగిరి, మార్చి 15 ప్రభాతవార్త:
శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామి వారికి కన్నుల పండువగా పుష్పయాగ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణ వెంకన్నకు నిర్వహించే నిత్య, వార, పక్ష, మాస, వార్షిక ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలలో చోటుచేసుకునే అపచారాల నివృత్తికై పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఇందులో భాగంగా ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు వేదపండితులు యాగశాలలో వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు ఆలయ ఆవరణలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు చామంతి, రోజా, గన్నేరు, సంపంగి, రుక్షికనకంబరాలు, తామర, కలువ, మొగలిరేకులు, మాను సంపంగి వంటి పుష్పాలతో, తులసి, దవనం, మరవం, బిల్వం, పన్నీరాకు వంటి ఆకులతో పుష్పయాగ మహోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. ఈ యాగ మహోత్సవానికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి 4 టన్నులు పుష్పాలు, పత్రాలను దాతలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాధ్, ప్రధాన అర్చకులు బాలాజీ రంగకుమార్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, గార్డెన్ మేనేజర్ జనార్ధన్ రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్లు ధనశేఖర్, అర్చకులు నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో అనధికార కాలేజీల దందా!
## విద్యాశాఖ మొద్దునిద్ర.. విద్యార్థుల భవిష్యత్తు అంధకారం!

తిరుపతి విద్య మార్చి 15 ప్రభాతవార్త.
విద్యా కేంద్రమైన తిరుపతిలో ఇప్పుడు అక్షర వ్యాపారం అదుపు తప్పింది. నిబంధనలను బూట్ల కింద తొక్కుతూ, ప్రభుత్వ అనుమతులు లేకపోయినా రంగురంగుల బోర్డులతో అక్రమ కాలేజీలు వెలుస్తున్నాయి. అపార్ట్‌మెంట్లలో, ఇరుకైన గదుల్లో విద్యార్థులను బంధించి లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో గుంజుతున్నారు. అధికారుల కళ్లముందే ఇంత అన్యాయం జరుగుతున్నా, వారు కళ్లు మూసుకుని ఉండటం వెనుక భారీ కుట్ర దాగి ఉంది. తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సాగుతున్న ఈ విద్యా మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది.

**అనుమతులు లేవు.. కానీ అడ్మిషన్ల జోరు!**
తిరుపతి నగరంలో వెలుస్తున్న చాలా కాలేజీలకు ఇంటర్మీడియట్ బోర్డు నుండి కనీస గుర్తింపు (అఫిలియేషన్ ) లేదు. కేవలం దరఖాస్తు చేసుకున్నామని చెబుతూ, అప్పుడే అడ్మిషన్లు పూర్తి చేసి తరగతులు కూడా ప్రారంభించేస్తున్నారు. నిబంధనల ప్రకారం అఫిలియేషన్ వచ్చాకే అడ్మిషన్లు తీసుకోవాలి, కానీ ఇక్కడ రూల్స్ అన్నీ కాగితాలకే పరిమితం అయ్యాయి. బోర్డు గుర్తింపు లేని ఈ కాలేజీల్లో చేరిన విద్యార్థులకు రేపు జరగరానిది ఏమైనా జరిగితే పరిస్థితి ఏమిటి? అప్పుడు ఆ యాజమాన్యాలు చేతులెత్తేస్తే విద్యార్థుల విలువైన జీవితం వృధా కాదా? ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు కూడా పెట్టకపోవడం దారుణం. ఈ మాయా కాలేజీల ప్రకటనలను చూసి తల్లిదండ్రులు మోసపోతున్నారు. అనుమతులు లేని కాలేజీల జాబితాను ప్రభుత్వం ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.




**అపార్ట్‌మెంట్‌లే కాలేజీలా? భద్రత గాలికి!**
ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక కాలేజీకి ఉండాల్సిన క్రీడా మైదానాలు, ప్రయోగశాలలు, విశాలమైన తరగతి గదులు తిరుపతిలోని ఈ కొత్త కాలేజీలలో ఎక్కడా కనిపించవు. కేవలం లాభాలే ధ్యేయంగా అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకుని, అందులోనే హాస్టల్స్, అందులోనే క్లాస్ రూమ్స్ నడుపుతున్నారు. అగ్నిమాపక (ఫైర్ సేఫ్టీ ) అనుమతులు లేని ఈ భవనాలు విద్యార్థుల పాలిట మృత్యుపాశాలుగా మారే ప్రమాదం ఉంది. ఒక్క అగ్నిప్రమాదం జరిగినా విద్యార్థులు బయటకు వచ్చే మార్గం కూడా లేని ఇరుకైన మెట్లు, గదులు భయం కలిగిస్తున్నాయి. మున్సిపల్ అనుమతులు లేకుండానే భవనాలను విద్యాసంస్థలుగా మార్చేస్తున్నారు.

**అఫిలియేషన్ మాయాజాలం బ్రాంచీల పేరిట దోపిడీ!**
కొన్ని విద్యాసంస్థలు నగరంలో ఒక చోట అనుమతి తీసుకుని, దానికి బ్రాంచీలంటూ నగరం చుట్టుపక్కల ఐదారు చోట్ల అక్రమంగా కాలేజీలు నిర్వహిస్తున్నాయి. ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం ఏ భవనానికి అనుమతి ఉంటే అక్కడే క్లాసులు నడపాలి. కానీ, తిరుపతిలో మాత్రం ఒకే గుర్తింపు నంబర్‌తో ఐదు కాలేజీలు నడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇది పచ్చిగా చెప్పాలంటే విద్యా చట్టాన్ని ధిక్కరించడమే. విద్యార్థుల హాజరును ఒక దగ్గర, చదువును మరో దగ్గర చూపిస్తూ పెద్ద ఎత్తున మాయాజాలం సాగిస్తున్నారు. పరీక్షల సమయంలో ఈ బ్రాంచీల విద్యార్థులను మెయిన్ క్యాంపస్ విద్యార్థులుగా చూపించి తప్పుదోవ పట్టిస్తున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినా మామూళ్ల మత్తులో జోగుతున్నారని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి.

**విద్యాశాఖ మొద్దునిద్ర... మామూళ్ల మత్తులో అధికారులు?**
అనధికార కాలేజీలు ఇంత బహిరంగంగా ప్రకటనలు ఇస్తున్నా విద్యాశాఖ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? ప్రతి ఏటా తనిఖీలు చేస్తామని చెప్పే అధికారులు, ఈ అక్రమ కాలేజీల దరికి ఎందుకు వెళ్లడం లేదు? క్షేత్రస్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయని తెలిసినా, ఉన్నతాధికారులకు నివేదికలు పంపడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారు? అధికారుల అండదండలు లేనిదే ఇంత పెద్ద ఎత్తున అక్రమ విద్యా వ్యాపారం సాధ్యం కాదని స్పష్టమవుతోంది. విద్యాసంస్థల యాజమాన్యాల నుండి అందుతున్న భారీ నజరానాలకు అధికారులు లొంగిపో యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**తల్లిదండ్రులారా జాగ్రత్త! ప్రకటనల మాయలో పడకండి!**
పెద్ద పెద్ద బిల్డింగులు, ఏసీ గదులు, టీవీల్లో వచ్చే రంగురంగుల ప్రకటనలను చూసి తల్లిదండ్రులు మోసపోవద్దు. మీరు కట్టే లక్షలాది రూపాయల ఫీజులు చివరకు బూడిదలో పోసిన పన్నీరు కాకూడదంటే జాగ్రత్త వహించాలి. మీ పిల్లలను చేర్పించే ముందే ఆ కాలేజీకి ప్రభుత్వం జారీ చేసిన అఫిలియేషన్ ఆర్డర్ ఉందో లేదో అడిగి తెలుసుకోండి. కాలేజీ బోర్డు మీద ఉన్న కోడ్ నంబర్‌ను ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో సరిచూసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ఈ అక్రమ విద్యా మాఫియాపై యుద్ధం ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైంది. లేనిపక్షంలో ఆధ్యాత్మిక నగరం తిరుపతి అక్రమ కాలేజీల అడ్డాగా మారి విద్యార్థుల జీవితాలను బలి తీసుకుంటుంది.

## వైభవంగా
# ప్రసన్న వెంకటేశ్వరునికి కల్యాణం





వడమాలపేట, మార్చి 15 ప్రభాతవార్త:
అప్పలాయగుంటలో అభయహస్తంతో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి ఆదివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం అయిన శ్రవణం రోజు ప్రతి నెల స్వామివారికి కల్యాణం జరిపించడం ఆనవాయితీ. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్వామివారితో పాటు ఉభయదేవేరుల ఉత్సవ మూర్తులను కల్యాణ మండపంలో కొలువుతీర్చారు. ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు అగ్నిహోమం, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా టీటీడీ లాంఛనాలతోస్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శ్రీవారు శ్రీదేవి, భూదేవి మెడలో మంగళసూత్రధారణ చేశారు.కల్యాణోత్సవం టికెట్లు తీసుకొన్న దంపతులు ఈ వేడుకను తనివితీరా తిలకించి పులకించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, రమణాచార్యులు, వేద పండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమానాస్పద రీతిలో యువకుడు మృతి

శాంతిపురం, మార్చి 15 ప్రభాతవార్త



మండలంలోని ఎంకెపురంకు చెందిన నవాజ్ (19) అనే యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన ఖాదర్ బాషా కుమారుడు నవాజ్ శనివారం రాత్రి ఇంటి బయటకు వచ్చి మరలా ఇంటికి వెళ్లలేదన్నారు. ఆదివారం ఉదయం కుటుంబీకులు గాలించగా గ్రామం వద్ద ఉన్న ఓ మామిడి తోటలో అనుమానాస్పద రీతిలో మృతి చెంది ఉండడాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తలకు గాయాలై ఉండడంతో అతన్ని హత్య చేసి ఉంటారని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## విద్యార్థినులకు పరీక్ష సామగ్రి వితరణ

బైరెడ్డిపల్లి, మార్చి 15 ప్రభాతవార్త



స్థానిక కమ్మనపల్లి గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులకు మహతి ఫౌండేషన్ శాంతమ్మ పరీక్ష సామ గ్రిని ఉచితంగా అందించారు. 72మంది విద్యార్థినులకు రాత అట్టలు, పెన్నులు అందజేశారు. విద్యార్థినులు బాగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పబ్లిక్ పరీక్షలు అంటే భయం వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సి పాల్ సుప్రజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలవికాస్ కేంద్రం ప్రారంభం

బైరెడ్డిపల్లి, మార్చి 15 ప్రభాతవార్త



స్థానిక నెహ్రూ వీధిలో భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా బాల వికాస్ కేంద్రాన్ని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు మధుసూధన ం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల వికాస కేంద్రంలో పిల్లలకు సత్యం, ధర ్మం, శాంతి, ప్రేమ, అహింస విలువలు పెంచడంతో పాటు వారికి సత్ ప్రవర్తన నేర్పించడం జరుగుతుందన్నారు. ఆరేళ్లపైబడిన వారు చేరవచ ్చన్నారు. వారంలో రెండు గంటలపాటు తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త డాక్టర్ యశోద, సేవాదళ్ సమన్వయకర్త గజేంద్రరెడ్డి, అడ్వకేట్ ప్రసాద్, గోపి, సుస్మిత, జ్యోతిర్మయి, రాజన్న, రాజగోపాల్, మనోహర్‌రెడ్డి, ప్రభాకర్‌నాయుడు, రాముర్రెడ్డి, ఉమాపతి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## కారు - టువీలర్ ఢీ..ఇద్దరికి తీవ్రగాయాలు

వి.కోట, మార్చి 15 ప్రభాతవార్త

మండలంలోని వి.కోట - నాయకనేరి మార్గంలో పాపేపల్లి మిట్ట వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వి.కోట నుంచి ఒగు వైపు వస్తున్న కారు అదుపు తప్పి అదే మార్గ ంలో వస్తున్న టు వీలర్‌ను ఢీకొంది. దీంతో అంజాద్ (27) అతీక్ అంజాద్(25)లు గాయపడ్డారు. స్థానికులు 108 ద్వారా గాయపడ్డ వారిని ఆస్పత్రికి చేర్చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గాయపడిన వారిని కుప్పం పిఇఎస్‌కు తరలించారు. ప్రమాదంకు గురైన కారులో ఒగుకు చెందిన లవకుమార్, గణేష్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

## సీఐని సన్మానిస్తున్న టీడీపీ నేతలు



చిన్నగొట్టిగల్లు మార్చి 15ప్రభాతవార్త

:భాకరాపేట సీఐ గా ఇటీవల భాధ్యతలు చేపట్టిన టీవీ సత్యనారాయణను టీడీపీ నాయకులు కలిసి సన్మానం చేశారు. అయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలు, ప్రజల పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీ లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో శివకుమార్, సంద్ర రెడ్డి, చంద్రశేఖర్, మంగళంపేట రఫీ, రాజేంద్ర, రెడ్డి సుబ్రహ్మణ్యం, మల్లేశ్వర, వెంకీ, సురేంద్ర నాయుడులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో, తాసిల్దార్ కార్యాలయాల తాళాలు పగులగొట్టి...

విలువైన వస్తువులు చోరీ , సీసీ కెమెరాల్లో అనుమానితుడు...
కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు

రైల్వే కోడూరు,మార్చి 15 ప్రభాతవార్త



రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండ లం ఎంపీడీవో, తాసిల్దార్ కార్యాలయాల తాళాలు మిషన్ల తో కోసి మొదట ఎంపీడీవో కార్యాలయంలో విలువైన టీవీ, గ్యాస్ సిలిండర్, కుక్కర్ చోరీలకు పాల్పడగా తాసి ల్దార్ కార్యాలయం తాళాలు కోశారే తప్ప అందులో ఎటువంటి వస్తువు లు తీసుకెళ్లలేదని తాసిల్దార్ యామిని, ఎస్సై మహేష్ నాయుడు తెలిపారు. వారి వివరాలు మేరకు సీసీ కెమెరాలు గుర్తు తెలియని వ్యక్తి ఉన్నారని క్షుణ్ణంగా పరిశీ లించి చోరీలకు పాల్పడిన వ్యక్తులను పట్టుకుంటామని ఎస్సై అన్నారు. దొంగలు ప్రత్యేకించి ప్రభుత్వ కార్యాల యాలను టార్గెట్ చేస్తూ అందులో ఉన్న విలువైన వస్తువు లను చోరీలకుపాల్పడంఇదేమొదటిసారిఅనిపలువురుఅంటున్నారు.

## రెడ్డి బంధువుల ఆత్మీయ సమావేశం విజయవంతం

రైల్వే కోడూరు రూరల్,, మార్చి 15 (ప్రభాతవార్త



రైల్వే కోడూరు పట్టణంలోని రాజు కన్వెన్షన్ హాలు నందు ఆదివారం రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమ్మేళనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి బంధువుల ఆత్మీయ సమ్మేళనం ద్వారా అందరూ ఐకమత్యంగా ఉండాలని ప్రతి ఒక్క కులానికి కుల సంఘాలు ఉన్నాయని లేనిది ఒక రెడ్డి వర్గానికి అని సమాజంలో ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో ఉండి పోరాటాలను సాగించి సమాజంలో ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా ఐకమత్యమే మహాబలం అని పాల్గొన్న పెద్దలు అన్నారు. ఈ కార్యక్రమానికి రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన రెడ్డీస్ పాల్గొని వారి వారి భావాలను తెలియజేశారు. రానున్న రోజుల్లో ఐక్యమత్యంతో రెడ్డీస్ కు సంబంధించిన వర్గీయులు సమాజంలో గుర్తింపు పొందాలని మంగంపేటకు చెందిన మైనింగ్ నాయకులు తల్లెం రమణారెడ్డి అన్నారు. అదేవిధంగా రైల్వేకోడూరు విక్టరీ పాఠశాల కు చెందిన నరసింహారెడ్డిమాట్లాడుతూ ప్రతి కులానికి కుల సంఘాలు పెట్టుకుని ఉన్నారు అని అందులో రెడ్డిస్కు మాత్రం కుల సంఘం లేకుండా ఉండేదని ప్రస్తుతం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందని రానున్న రోజుల్లో ఐక్యమత్యంతో విజయాలను సాధిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ రెడ్డి, చలపతి రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కౌలూరి అమరేశ్వర్ రెడ్డి తో పాటు పలువురు నియోజకవర్గ రెడ్ల వర్గం పాల్గొన్నారు.

## రాజ్యంగం పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యం

చిత్తూరుహెల్త్, మార్చి 15 ప్రభాతవార్త:



రాజ్యంగం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఉద్యమ స్ఫూర్తితో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది చింతమాకుల పుణ్యమూర్తి అన్నారు. చిత్తూరు అంబేద్కర్ భవన్‌లో ఆదివారం సాయంత్రం బహుజన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం-2026 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన ప్రముఖులకు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి బహుజన ఉద్యోగ సంఘ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పుణ్యమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు హక్కులు తెలుసుకుని వాటిని సాధించుకొని అభివృద్ధి చెందాలన్నారు. ప్రస్తుతం బహుజన వర్గాలు, యువత, మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని, దళితుల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను సైతం ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగంను రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరు ప్రశ్నించడం ప్రారంభించాలన్నారు. బహుజనులను అప్రమత్తం చేయడానికి చిత్తూరులో బహుజనుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాజ్యాంగం పట్ల యువత అవగాహన పెంచుకోవాల్సి న అవసరం ఎంతైనా వుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో బహుజనులు పాల్గొన్నారు.

## నేడు పోలీసు స్పందన

చిత్తూరుహెల్త్, మార్చి 15 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ దూడి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి పాత జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు సమస్యలపై వినతిపత్రాలు ఎస్పీ తుషార్ దూడిని కలిసి సమర్పిస్తే ఆయన వాటిని సత్వరం పరిశీలించి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కడ పి.డి

కుప్పం, మార్చి 15 ప్రభాతవార్త



నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గ ంటలనుంచి మధ్యాహ్నం1 గంట దాకా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలనుంచి నేరుగా వినతులు స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఉచిత సంతాన సాఫల్య శిబిరం విజయవంతం

కుప్పం, మార్చి 15 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలోని బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరంకు విశేష స్పందన లభించినట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు తెలిపారు. బెంగళూరు నోవా ఫెర్టి లిటీ సెంటర్ డాక్టర్ లావణ్య, బిఆర్‌డి ఆస్పత్రి సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ హరిత మండవ అధ్వర్యంలో ఈ శిబిరం జరిగిందన్నారు. సుమారు 74 మందికి పైగా ఈ శిబిరంకు సంతానం లేని దంపతులు హాజరు కాగా వారిలో 15మందిని ఐవిఎఫ్ చికిత్స ల కోస ం ఎంపిక చేసినట్లు తెలిపారు.

## చేస్తున్న అభివృద్ధి..సంక్షేమాలు ప్రజలకు చెప్పాలి

- ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, మార్చి 15 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కుటుంబ సాధికార సభ్యులు (కెఎస్ఎస్)లు ప్రజలకు చెప్పాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం సూచించారు. ఆదివారం కంగు ందిలో జరిగిన కెఎస్ఎస్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను సిఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను పార్టీలకు అతీతంగా అందిస్తున్నారన్నారు. వీటితో పాటు కుప్పం ప్రజల చిరకాల వాంఛ అయిన కృష్ణాజలాలను తీసుకువచ్చారన్నారు. కుప్పంలో ఇప్పటికే 7203కోట్లతో ఇరవై పరిశ్రమలు వచ్చాయన్నారు. వీటి ద్వారా సుమారు 40-50వేలమందికి అతిత్వరలోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మహిళలు కూడా ఆర్థికంగా ఎదిగేలా కడ ద్వారా వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. గ్రామాలను సిఎం చంద్రబాబు అభివృద్ధి బాట పట్టించారన్నారు. వీటిని ప్రజలకు తెలపాలన్నారు. అలాగే ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారంకు కృషి చేయాలన్నారు. సమావేశంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కడ సభ్యుడు రామచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, సర్పంచ్ ధనశేఖర్, కార్పోరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజ్, మైనార్టీ అధ్యక్షుడు మునాఫ్, పార్టీ అధ్యక్షుడు షరీఫ్‌పాల్గొన్నారు.



## మిట్టపల్లిలో ఘనంగా ఇఫ్తార్ విందు

కుప్పం, మార్చి 15 ప్రభాతవార్త

మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ముస్లింల పవిత్ర రమజాన్ మాసంను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మైనార్టీలకు సిఎం చంద్రబాబునాయుడు అన్ని విధాలా ఆదుకుంటున్నారన్నారు. మైనార్టీల స ంక్షేమంకు పెద్దపీట వేశారన్నారు. ముస్లింలు రమజాన్ పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కార్పోరేషన్ డైరెక్టర్ మణి,మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, కనీసవేతనాల

## వరసిద్దుని సేవలో కర్నాటక రాష్ట్ర ఉప లోకాయుక్త

కాణిపాకం, మార్చి 15 ప్రభాతవార్త:



కర్నాటక రాష్ట్ర ఉప లోకాయుక్త జస్టిస్ బి.వీరప్ప ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెంటెంట్ వాసు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి ప్రత్యేక అభిషేకం సేవలో పాల్గొన్నారు. అలాగే ప్రధాన ఆలయంలోని అనుబంధ ఆలయాలు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవిలతో పాటు ప్రోటోకాల్ అధికారులు పాల్గొన్నారు.

## అరగొండ అపోలోచే 120 మందికి ఉచిత వైద్యపరీక్షలు

తవణంపల్లె, మార్చి 15 ప్రభాతవార్త:



అరగొండ అపోలో ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన న్యూరో ఉచిత వైద్యశిబిరం ద్వారా 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అపోలో ఆస్పత్రి అరగొండ అపోలో హాస్పి టల్‌లో సీనియర్ న్యూరో కన్స లైంట్, సర్జన్ డాక్టర్ బాలమురుగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూరాలజి శిబిరాన్ని హాస్పి టల్స్ సీఈఓ నవీన్‌కుమార్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు.ఈసందర్భంగా నరాలకు సంభందించి 120 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి 20 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. వారికి ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అరగొండ అపోలో ఆస్ప త్రిలో శస్త్రచికి్స తలు నిర్వహించన్నుట్లు తెలిపారు. క్లిష్టమైన ఆపరేషన్‌లను తక్కువ ఖర్చుతో చెన్నై అపోలో ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు డాక్టర్ బాలమురుగన్, డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డిలు తెలిపారు.ఈకార్యక్రమంలో మార్కెటింగ్ జీఎం బాలభాస్కర్,అరగొండ అపోలో ఆస్పత్రి మేనేజర్ ఎన్.కేశవరెడ్డి,అసిస్టెంట్ మేనేజర్ రాంకుమార్‌రెడ్డి, మార్కెటింగ్ పీఆర్ఓ ఎస్.కమరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడుగా సుధీర్‌కుమార్

పలమనేరు, మార్చి 15, ప్రభాతవార్త:




ఎపిపిడిసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడుగా సుధీర్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం పలమనేరు డిపో కార్యాలయం వద్ద ఈ మేరకు ఆ యూనియన్ నాయకులు సుధీర్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త పలమనేరు సమీపంలోని చరణ్ హోటల్ యజమాని సుధీర్‌కుమార్ బెంగళూరులో ఉంటున్నారు. గతంలో పలమనేరు ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడుగా పనిచేశారు. యూనియన్‌ను ఒక తాటిపై నడిపించి అప్పట్లో జరిగిన ఎన్నికల్లో విజయభేరి మోగించారు. కొంతకాలం పాటు దూరమైనా మళ్ళీ ఆ యూనియన్ నాయకులు పట్టుబట్టి మళ్ళీ జిల్లా గౌరవ అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ఎంప్లాయిస్ యూనియన్ జిల్లాలో 7 స్థానాల్లో పోటీ చేస్తుందని ప్రకటించారు. అన్ని స్థానాల్లోనూ విజయ కేతనం ఎగురవేయాలని ఇందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు కిందపడి వృద్ధురాలికి తీవ్రగాయాలు

పలమనేరు, మార్చి 15, ప్రభాతవార్త:

పలమనేరు ఆర్టీసీ బస్టాండు ఎదురుగా పోలీస్ స్టేషన్ ఎదుట ఆర్టీసీ బస్సు కింద పడి గుర్తు తెలియని వృద్ధురాలు (65)తీవ్రంగా గాయపడింది. పలమనేరు సమీపంలోని గంటావూరుకు చెందిన వృద్ధురాలు రహదారిపై వెళుతుండగా ఆర్టీసీ బస్సు మలుపు తిరుగుతూ ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు బస్సు కింద పడడంతో చుట్టుపక్కల వారు గుర్తించి అరచి కేకలు వేయగా డ్రైవర్ బస్సును నిలిపివేశారు. ఐతే అప్పటికే చక్రాల కింద నలిగిపోవడంతో రెండు కాళ్ళు విరిగిపోయాయి. స్పృహలో లేక పోవడంతో కనీసం పేరు కూడా తెలియడంలేదు. తెలిసిన వారు మాత్రం గంటావూరుకు చెందిన వృద్ధురాలుగా గుర్తించారు. ఐతే ఈమెకు సంబంధించిన వారు ఎవరూ రాకపోవడంతో ఏకాకిగా ఆసుపత్రిలో బెడ్‌పై పడివుంది.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల వున్న ప్రజలు హాజరై తమ సమస్యలను రాత పూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని క్షేత్ర స్థాయిలో సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు హాజరు కావాలని ఆయన ఆదేశించారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను స్వీకరించి వాటిని సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## చిన్నంపల్లి పాస్టేట్ కార్యదర్శిగా సురేష్





యాదమరి, మార్చి 15 ప్రభాతవార్త:

యాదమరి మండలం సిఎస్ఐ వేలూరు డయాసిస్ చిన్నంపల్లి పాస్టేట్ కార్యదర్శిగా కీనాటంపల్లి గ్రామంకు చెందిన జె.సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిన్నంపల్లి పాస్టేట్ ఎన్నికలు ఆదివారం చిన్నంపల్లి పాస్టేట్ చర్చి ఆవరణలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కార్యదర్శిగా జె.సురేష్, కోశాధికారిగా పాత చిన్నంపల్లి గ్రామంకు చెందిన పి.ఆరిగాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యదర్శి, కోశాధికారులను క్రైస్తవ నాయకులు అభినందించారు.

## నేడు పోలీసు స్పందన

చిత్తూరుహెల్త్, మార్చి 15 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ దూడి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి పాత జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు సమస్యలపై వినతిపత్రాలు ఎస్పీ తుషార్ దూడిని కలిసి సమర్పిస్తే ఆయన వాటిని సత్వరం పరిశీలించి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారు.

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వడమాలపేట, మార్చి 15 ప్రభాతవార్త:

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు పద్మావతి, తులసిరామ్‌లు తెలిపారు. మండలంలో ఆరు ప్రభుత్వ, రెండు ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 322 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాయనున్నారు. అందులో రెండు ప్రైవేటు పాఠశాలల్లో పాటు, బాలుర, బాలికల పాఠశాల విద్యార్థులు వడమాలపేటలో సెంటర్ కాగా తడుకు ఆర్ఎస్, బొమ్మరాజుపురం విద్యార్థులు పుత్తూరు మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లి కేంద్రంలో, సీతారామపురం, పత్తి పుత్తూరు విద్యార్థులు రామచంద్రాపురం మండలంలోని సొరకాయలపాళెం కేంద్రంలో పరీక్షలు రాయాల్సి ఉంటుంది. వడమాలపేటకేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి అవసరమైన బల్లలు, లైట్లు, ఫ్యాన్‌లు, మంచినీరు, ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అలాగే పరీక్షలు జరిగే రోజు వైద్య సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని వారు తెలిపారు. విద్యార్థులు ఏకాగ్రతతో, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని వారు కోరారు.

## నేటి నుంచి పది పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

సత్యవేడు, మార్చి 15 ప్రభాతవార్త:



పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా సత్యవేడు మండలంలోని పలు హైస్కూల్‌కు సంబంధించిన రెగ్యులర్ విద్యార్థులు 602 మంది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నట్లు స్థానిక మండల విద్యాశాఖ అధికారి రవి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల కేంద్రంలో 202 మంది విద్యార్థుల హాజరవుతుండగా పరీక్షల చీఫ్‌గా హిమకుమార్, బాలికల గురుకులలో 200 మంది పరీక్షలు రాయనుండగా పరీక్షల ప్రధాన అధికారిగా ముని సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో 200 మంది విద్యార్థులు రాయనుండగాపరీక్షల ప్రాధానాధికారిగా వెంకటేశులు వ్యవహరిస్తారని ఆయన వివరించారు. అయితే మండలంలోని పీవీ పురం హైస్కూలు సంబంధించిన విద్యార్థులు 9 మంది నాగలాపురం మండలం బీరకుప్పం కేంద్రంలో పరీక్షలు రాస్తారన్నారు. మార్చి 16 నుంచి 30 తేదీ వరకు పరీక్షలు కొనసాగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి వైద్య సదుపాయం, విద్యార్థులు పరీక్షలు రాయడానికి అనువుగా డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. అయితే విద్యార్థులు అర్ధగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఎటువంటి మాస్ కాపింగ్‌కు తావు లేకుండా పదో తరగతి పరీక్షలు పగడ్బందీగా జరుగుతుందన్నారు.

## జనసేన కమిటీ నాయకుల ఆత్మీయ సమావేశం

సత్యవేడు, మార్చి 15 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంజనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కొప్పులు లావణ్యకుమార్ ఆదేశాల మేరకు జనసేన సత్యవేడు మండల కమిటీ నాయకులు మండల అధ్యక్షుడు కూరాకుల రూపేష్ ఆధ్వర్యంలో జనసేన మండల కమిటీ నాయకుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. జనసేన మండల కమిటీ నాయకుల సమావేశంలో జనసేన పార్టీని సత్యవేడులో పార్టీ కోసం ఒక అడుగు ముందుకేసి మండల స్థాయి నుంచి విలేజ్ స్థాయి వరకు పార్టీని ముందుకు తీసుకెళ్లాలని చెప్పి అందరిని ఏకాదటిపై నడిపించేలా జనసేన మండల కమిటీ పార్టీ ప్రెసిడెంట్ కూరాకుల రూపేష్ కోరడం జరిగింది. సత్యవేడు పట్టణంలో జరుగుతున్న పరిణామాల గురించి మండల కమిటీ నాయకులకు దిశా నిర్దేశం చేసి మండల కమిటీ నాయకుల మనోభావాలను అర్థం చేసుకుని మండల కమిటీ నాయకులకు అధిష్టానం సపోర్టుగా ఉంటాదని పేర్కొన్నారు. ఉద్యమ సభ్యత్వాలను వేగవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండల కమిటీ నాయకులు జ్యోతిశ్వర్, మునిశేఖర్, కుమార్, ప్రసన్న, ధనుష్, అనిల్, జ్యోతి, మునికుమార్, పవన్‌కల్యాణ్, సతీష్ పాల్గొన్నారు.

## దివ్యాంగులు, వృద్ధులకు సహాయ పరికరాల గుర్తింపు శిబిరం

చిన్నగొట్టిగల్లు:మార్చి 15ప్రభాతవార్త

:భారత ప్రభుత్వం సౌజన్యంతో కృత్రిమ అవయవాల తయారీ సంస్థ), కాన్పూర్ ఆధ్వర్యంలో దివ్యాంగులు మరియు వృద్ధుల కోసం సహాయ పరికరాల గుర్తింపు శిబిరం ఆదివారం చిన్నగొట్టిగల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం మండలాలకు చెందిన లబ్ధిదారులను పరీక్షి ంచి వారికి అవసరమైన చేతికర్రలు, వాకర్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు తదితర పరికరాల కోసం ఎంపిక చేశారు. శిబిరానికి 75 మంది దివ్యాంగులు, 76 మంది వృద్ధులు హాజరుకాగా మొత్తం 151 మంది లబ్ధిదారులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో తిలితీదివీ సిబ్బంది, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు, చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో ఎ.గిద్దయ్య, యర్రావారిపాలెం ఎంపీడీవో దివాకర్, తెలుగుదేశం మండల క్లస్టర్ ఇంచార్జ్ శివ కుమార్, ముత్తం ప్రభాకర్ ,స్వర్ణగ్రామం మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.
ఫోటో: సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షుడు కిషోర్ రాయల్

## విశ్వకర్మ మేడాను సందర్శించి వస్తువులను కొనుగోలు చేసిన ఎంపీపీ

విజయపురం, మార్చి 15 ప్రభాతవార్త:



రాష్ట్ర ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో తిరుపతిలోని శిల్పారామంలో జరుగుతున్నటువంటి పీఎం విశ్వకర్మ మేళాను ఆదివారం సందర్శించి వస్తువులను విజయపురం ఎంపీపీ లక్ష్మీపతిరాజు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేళా ద్వారా చేతి వృత్తుల వారు, కలంకారి, చేనేత పరిశ్రమల వారు తయారు చేసిన వస్తువులను విక్రయించి ఆర్థికంగా నిలదొ క్కుకునే వెసులుబాటును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయన్నారు. ఇటువంటి వస్తువులను వినియోగ దారులు చాలా చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలకు చాలా ఉపయో గకరంగా ఉంటుందని తెలియజేశారు. ఈ మేళాను సందర్శించిన వారిలో ఎంపీపీతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు తదితరులు ఉన్నారు.

## పాలిటెక్నిక్ క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన



తిరుపతి విద్య, మార్చి 15 ప్రభాతవార్త

హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్స్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూల్డ్ క్యాంపస్ డ్రైవ్ చేపట్టారు. చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాలలోని 22 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన ఈఈఈ, ఈసీఈ, మెకానికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న డిప్లొమో విద్యార్థులు 300మంది క్యాంపస్ డ్రైవ్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వై ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ రైల్వే ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ మేధా సర్వే కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ చేపట్టి విద్యార్థులకు ఉద్యోగవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. రిక్రూట్మెంట్ ప్రక్రియలో భాగంగా తొలిత విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షి ంచడానికి కఠినమైన రాత పరీక్ష నిర్వహించారని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులు రెండో దశ పర్సనల్ ఇంటర్వ్యూకు సెలక్ట్ అయ్యారని, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను వచ్చే వారం అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. రాయలసీమ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉపాధి అవకాశాలను కల్పించడంలోనూ, విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య వారధిగా నిలవడంలోనూ ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ తన వంతు కృషి చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి జీవిస్ రాధ, ఫార్మసీ హెడ్ హరీష్ బాబు, అధ్యాపకులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 16 నుంచి 18వ తేదీ వరకు రైతన్న మీ కోసం వారోత్సవాలు

వరదయ్యపాళెం, మార్చి 15 ప్రభాతవార్త:

వరదయ్యపాళెం మండలంలోని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీ కోసం వారోత్సవాలు కార్యక్రమం సోమవారం నుంచి 18వ తేదీ వరకు జరుగుతుందని టీడీపీ నాయకులు తెలిపారు. ప్రతి ఇంటికి రైతుకు అన్నదాత సుఖీభవ పథకంపై మండలంలోని రైతుల ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## టూరిస్ట్ బస్సులపై రవాణా శాఖ దాడులు

### రూ. 4.30 లక్షల జరిమానా

తిరుపతి రవాణ, మార్చి 15 ప్రభాత వార్త



రవాణా శాఖ చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో పన్నులు చెల్లించ కుండా నడుస్తున్న రెండు టూరిస్ట్ బస్సులు పట్టు బడ్డాయి. జిల్లాలో వాహన భద్రత, పన్నుల వసూలు, మోటారు వాహనాల చట్టం అమలును కట్టు దిట్టం చేయడానికి జిల్లా రవాణా అధికారి కొర్రపాటి మురళీ మోహన్ ఆదేశాల మేరకు అధికారులు తిరుపతి పరిసరాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో, తిరుపతి-హైదరాబాద్ మార్గంలో నడుస్తున్న నాగాలాండ్ రిజిస్ట్రేషన్ కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సును ఆపి పరిశీలించగా, ఆల్ ఇండియా పర్మిట్ పన్నులు చెల్లించకుండా ప్రయాణికులను తరలిస్తున్నట్లు తేలింది. వెంటనే కేసు నమోదు చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకుని రూ. 3.60 లక్షల జరిమానా విధించారు. తర్వాత హైదరాబాద్ నుండి తిరుపతికి వస్తున్న మరో టూరిస్ట్ బస్సులోనూ ఇదే ఉల్లంఘన బయటపడింది. దీనిపై శాఖ రూ. 70,000 జరిమానా విధించింది. మొత్తం రెండు వాహనాలపై కలిపి రూ. 4.30 లక్షల జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల సందర్భంగా ప్రయాణికులకు రహదారి భద్రత, ఎమర్జెన్సీ డోర్ వినియోగం, అగ్నిమాపక పరికరాల ప్రాముఖ్యత గురించి సిబ్బంది అవగాహన కల్పించారు. జిల్లా రవాణా అధికారి మురళీ మోహన్ మాట్లాడుతూ, "పన్నులు తప్పించుకునే వాహనాలపై కఠిన చర్యలు తప్పవు. రహదారి భద్రతను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి" అని స్పష్టం చేశారు.. ఈ కార్యక్రమంలో తనిఖీ అధికారులు అతికా నాజ్, ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు

## పదో తరగతిపరీక్షకు పటిష్ట బందోబస్తు

నాగలాపురం, మార్చి 15 ప్రభాతవార్త:



నాగలాపురం మండల పరిధిలో పదో తరగతి(ఎస్ఎస్‌సీ) పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు నాగలాపురం పోలీసులు విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్ఐ సునీల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద శాంతి భద్రతలు కాపాడేందుకు తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్షల సమయంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు, మాల్ ప్రాక్టీసులు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనవసరంగా గుమికూడడాన్ని అనుమతించరని తెలిపారు. తల్లిదండ్రులు, ఇతరులు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడకుండా సహకరించాల న్నారు. పరీక్షా సమయాల్లో పరీక్షా కేంద్రాలసమీపంలో ఉన్న జిరాక్స్, ఫోటోకాపీ కేంద్రాలు మూసి వేయాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షలకు సమయానికి హాజరై ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి పోలీసుశాఖ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. పరీక్షల నిర్వహణకు ప్రజలు సహకరించి, శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసుశాఖకు తోడ్పడాలని నాగలాపురం ఎస్ఐ సునీల్ తెలిపారు.

## నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, మార్చి 15 ప్రభాతవార్త :



ఈ నెల 16 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమా న్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరు గుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్స్ అప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పద్మానగర్‌లో కార్డెన్ సర్చ్...

### 23 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో సీజ్

రేణిగుంట మార్చి 15 ప్రభాతవార్త



రేణిగుంట మండలం రూరల్ సర్కిల్ గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఎస్పై నాగరాజు తమ సిబ్బందితో జి పాలెం పంచాయితీ కుక్రకాలవ పద్మా నగర్ నందు శనివారం ఉదయం కార్డాన్ సెర్చ్ (వజ్రపహార్) నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సరిగాలేని 23 ద్విచక్ర వాహనాలను ఒక ఆటోను సీజ్ చేశారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. వారి వివరాలను అడిగి తెలుసుకుని ఆధార్ కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసరావు, సీఐ మంజునాథరెడ్డి మాట్లాడుతూ కాలనీలో కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలు, బాలికలు, వృద్ధులను వేధించడం చట్టరీత్యా నేరమన్నారు. రాత్రి సమయాల్లో అసంపూర్తిగా ఉన్న కట్టడాలలో మద్యం సేవించకూడదని హెచ్చరించారు. గంజాయి తదితర మాదకద్రవ్యాలు సేవించినా, అమ్మినా, సరఫరా చేసిన కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేకాట లాంటి జూదాలు ఆడకూడదు అన్నారు. కార్యక్రమంలో రేణిగుంట సబ్ డివిజన్ పరిధికి చెందిన పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి సాయంత్రం సంతలో దొంగతనాలు జరగకుండా తమ సిబ్బందితో కట్టుదిడ్డమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా ఆదివారం ఎరమరెడ్డి పాలెం లో రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఎస్పై నాగరాజు తమ సిబ్బందితో ప్రజలకు పలు నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

వడమాలపేట, మార్చి 15 ప్రభాతవార్త:



అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. వడమాలపేట మండలం పాపరాజు కండ్రిగకు చెందిన జి.వెంకటేశ్వర రావుకు రూ.2,44,888లు, ఎస్‌బీఆర్ పురం కు చెందిన పోతురాజు సుబ్రహ్మణ్యంకు రూ.25,166లు, వడమాలపేటకు చెందిన ఎస్.హేమంత్‌కుమార్‌కు రూ.77,984లు, వెంకట్రామాపురంకు చెందిన దామోధర్‌నాయుడుకు రూ.40,541లు, పుత్తూరుకు చెందిన ఎస్.మస్తాన్‌వలికు రూ.1,30,360ల చెక్కులు వారి ఇళ్ళ వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధనంజయలు నాయుడు, దాముయాదవ్, శివరాయల్, ఉమాపతిరావు, వెంకటయ్య, హేమావతి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అనంతరాజుపేట మైనారిటీ నాయకుడి ఇంట్లో ఇఫ్తార్ విందు

రైల్వేకోడూరు. మార్చి 15 ప్రభాతవార్త



రైల్వే కోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయితీ మైనారిటీ నాయకులు ఎస్ఏ సలాం తనయుడు షఫీ ఆధ్వర్యంలో ముస్లింలకు భారీ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసీపీ సీనియర్ నాయకులు మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి వైసీపీ సర్పంచులు భారీగా పాల్గొని ఉపవాసాల సమయంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో ఆనందాన్నిచ్చిందని ఆయన అన్నారు. ప్రతి ఏటా రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తామని షఫీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు మస్తాన్, ఆర్వి రమణ, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, గౌతమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతతోనే అధికారం సాధ్యం

### బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్.

చిట్వేలి, మార్చి 15, ప్రభాతవార్త:



వెనుకబడిన వర్గాలు ఐక్యతగా ఉన్నప్పుడే అభివృద్ధి, అధికారం సాధ్యమవుతుందని భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు బోడె. రామచంద్ర యాదవ్ అన్నారు. ఆదివారం తొలిసారిగా రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని సందర్శించగా ప్రజలు, బీసీ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. రైల్వే కోడూరు నుంచి చిట్వేలి మీదుగా నాగవరం, సీఎం రాచపల్లి, సిద్ధారెడ్డిపల్లి, నేతివారిపల్లి, వెంకటరాజుపల్లి గ్రామాల వరకు ఆయన పర్యటించారు. గ్రామాల్లో ప్రజలు పెద్దఎత్తున చేరుకుని పూలమాలలు వేసి జేజేలు పలుకుతూ స్వాగతం పలికారు. చిట్వేలి అంబేద్కర్ సర్కిల్, రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద స్వాగతం అనంతరం వడ్డెర ఓబన్న సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొత్తగా నిర్మించిన శ్రీ జ్ఞాన తిప్ప అయ్యప్ప స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్వేలి మండల బీసీ నాయకుడు సలకంచు రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ బీసీ హక్కుల కోసం రామచంద్ర యాదవ్ నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా బీసీవై పార్టీని చట్టసభలకు పంపించాలని రామచంద్ర యాదవ్ ప్రజలను కోరారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యటనకు ఉత్సాహం తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త తాలూరు సుబ్రహ్మణ్యం, వంకర రమణయ్య, హరిబాబు, నారాయణస్వామి, నాగార్జున యాదవ్, కాకర్ల మధు, సూర్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చాముండేశ్వరి, హిమబిందు, స్టేట్ కన్వీనర్ కుమ్మరి గిరిబాబు, పుంగనూరు చంద్రమోళి, నర్సీపట్నం విక్రమ్, బీసీ సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

## దైవత్వంతో కూడిన విద్య పిల్లలకు అవసరం

చిట్వేలి, మార్చి 15, ప్రభాతవార్త:



పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు దైవత్వంతో కూడిన విద్య అవసరమని ధర్మనిధి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రామ్మోహన్, వెంకట శివ , విశ్రాంత ఎంఈఓ రవీంద్ర లు అన్నారు. ధర్మనిధి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శివాలయంలో పిల్లలకు ధార్మిక విద్యపై అవగాహన కల్పించారు. విశ్రాంత ఎంఈఓ రవీంద్ర పిల్లలకు యోగాసనాల లో అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల పట్ల గౌరవం, సమాజం, సంస్కృతి, ఉపాధ్యాయులు సాంప్రదాయాలు, విలువలను గౌరవిస్తూ సమాజంలో జీవించాలన్నారు. సన్మార్గంలో నడుస్తూ సమాజ శ్రేయస్సు కు సహకరించాలన్నారు. ఈ కార్మిక కార్యక్రమాల్లో మండలంలోని పిల్లలు వందమంది పైగా ధార్మికవిధిపై అవగాహన పొందారు. పిల్లలకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మనిధి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సాయిరాం, సునీల్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవే పరమావధిగా ఎన్టీఆర్ ట్రస్ట్

### ఎన్టీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నారా భువనేశ్వరీ

రామచంద్రాపురం, మార్చి 15 ప్రభాతవార్త:




ప్రజాసేవే పరమావధిగా ఎన్టీఆర్ ట్రస్ట్ పనిచేస్తుందని ఎన్టీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నారా భువనేశ్వరి అన్నారు. హైదరాబాద్‌లో శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్ 30వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని రామచంద్రాపురం మండలం, కమ్మపల్లికి చెందిన ఏపి ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబును అప్రిషియేషన్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ విద్య, వైద్య, విపత్తుల నిర్వహణ, రక్తదాన శిబిరాలు వంటి సేవలను దేశ విదేశాలలో అందిస్తున్నట్లు తెలిపారు. చంద్రగిరి, తిరుపతి, నగరి నియోజకవర్గాలలో యువతకు, మహిళలకు, బడుగు బలహీన వర్గాల వారికి, అనారోగ్యంతో భాధపడుతున్న వారికి తనదైన శైలిలో సహాయ సహకారాలు అందిస్తున్న చినబాబును అప్రిషియేషన్ అవార్డుతో సత్కరించడం సముచితమని అన్నారు. వ్యాధిగ్రస్థులైన చిన్నారులకు నిరంతర సేవలందిస్తున్న ట్రస్ట్ కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సిఈఓ ఛీఫ్ ఆపరేషన్ అధికారి అడుసుపల్లి గోపి, ట్రస్ట్ తిరుపతి ప్రతినిధి రవికుమార్, దినేష్, నూతలపాటి చంద్రబాబు, జయప్రకాష్, భాను, మురళి, తదితరులు

## ఆక్రమణలో కళియంబాకం పెద్ద చెరువు

విజయపురం, మార్చి 15 ప్రభాతవార్త:



మండలంలోని కళియంబాకం పెద్ద చెరువు ఆక్రమణకు గురైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువులో కొందరు ఇష్టానుసారం చెరువులకు ఆక్రమణలకు గురి చేయడం వలన చెరువులో నీటి నిల్వ విస్తీర్ణం తగ్గిపోతుందని పశువులు మేపడానికి కూడా స్థలాలు లేకుండా ఇబ్బంది పడుతున్నారని వాపోతున్నారు. చెరువు సమీపంలో పొలాలు ఉన్న వారికి దారి లేకుండా ఇబ్బందికి గురి చేస్తున్నారని అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు, పోలీసు, తహసీల్దార్‌కి ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## సంజీవయ్యా.. నీ పద్ధతి మార్చుకో -ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, మార్చి 15 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే పద్ధతి మార్చుకుని హుందాగా వ్యవహరించాలని, లేనిపక్షంలో తాము కూడా ధీటుగా సమాధానం చెప్పాల్సి వస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హెచ్చరించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా వ్యవహరించాల్సిన ఆయన చౌకబారు రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుని ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. అభివృద్ధిపై తమను ప్రశ్నిస్తే సమాధానం చెబుతామని, అసత్య ఆరోపణలు చేస్తూ అభూతకల్పనలతో లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. పెళ్లకూరులో ఇసుక రీచ్ వద్దకు వెళ్లి అర్థంపర్థం లేని రాద్ధాంతం చేశారని ఆమె చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుస్తున్న రీచ్ వద్దకు వైసీపీ నేతలు, కార్యకర్తలతో వెళ్లి అక్కడి సిబ్బందిపై దౌర్జన్యం చేయడమే కాకుండా అక్కడ ఏదో తప్పు జరిగిపోతున్నట్లు ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నం చేయడం హేయమైన చర్య అన్నారు. తమ కుటుంబం ఇసుకను విక్రయిస్తున్నట్లు అసత్య ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామే గాని ఎవరిపైనా కక్ష్యసాధింపు చర్యలు చేపట్టే యోచన లేదన్నారు. చంద్రబాబు కనుసైగ చేస్తే తాము కూడా రౌడీయిజం చేసి చూపించగలమని నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట పట్టణ టిడిపి అధ్యక్షులు 786 రఫీ మాట్లాడుతూ గత ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎన్నో అకృత్యాలు చేశారని, టిడ్కో ఇళ్ల వద్ద ఇసుకను మాయం చేయడంతో పాటు గంజాయి, హౌస్‌ను గుట్టుచప్పుడు కాకుండా తన అనుచరులతో విక్రయించారన్నారు. ఈ సమావేశంలో ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రూరల్ పార్టీ అధ్యక్షులు పాకం వెంకటసుబ్బయ్య, పెళ్లకూరు నాయకులు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులచే ఇసుక రీచ్ అడ్డగింత




పెళ్లకూరు, మార్చి 15 ప్రభాతవార్త: మండలంలోని కలవకూరు పంచాయతీ నందు గల ప్రభుత్వ ఇసుక రీచ్‌ను సూళ్లూరుపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో మాజీ ఎన్‌డిడిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మండల వైఎస్సార్సీపీ నాయకులతో కలిసి అడ్డుకున్నారు. ఇసుక రీచ్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలను ఉపయోగించి టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని అంతే కాకుండా ప్రభుత్వం అనుమితి ఇచ్చిన దానికంటే ఎక్కువ లోతులో ఇసుకను తవ్వడం ద్వారా భూగర్భ జలాలు ఇంకి పోయి రైతులకు నీటి సమస్యలు తలెత్తుతాయని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల గృహ అవసరాలు కోసం అని ఉచిత ఇసుకను ప్రవేశపెడితే దానిని అవకాశంగా తీసుకున్న కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు ఇసుకను చెన్నై తిరుపతి నగరాలకు అక్రమంగా తరలిస్తూ ఆదాయ వనరుగా మార్చుకుని కోట్లు గడిస్తున్నారన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు గ్రావెల్ ఇసుక అక్రమ రవాణాలో తమ ప్రేమేయమే లేదని ప్రమాణాలు చేస్తుంటే మరి ఈ ఇసుక దందాను నడిపిస్తున్నది ఎవరో నిరూపించగలరా అని ఛాలెంజ్ విసిరారు. వైయస్సార్సీపి పార్టీ న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తుందన్నారు. వైసీపీ నాయకులు ఇసుక రీచ్‌ను అడ్డగించారని సమాచారం తెలుసుకున్న పోలీసులు నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వర రావు, పెళ్లకూరు ఎస్ఐ ఆదిలక్ష్మి రీచ్ వద్దకు చేరుకుని ఎలాంటి ఘర్షణలు లేకుండా వారి వద్ద నుంచి ఫిర్యాదును సేకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నన్నం ప్రిస్కిల్లా, ఎంపీపీ పొలంరెడ్డి శేఖర్‌రెడ్డి, సాగి జితేంద్ర, మండల వైఎస్‌ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన




పెళ్లకూరు, మార్చి 15 ప్రభాతవార్త: పెళ్లకూరులో స్థానికంగా ఉన్న చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి (అరవింద్ హాస్పిటల్ మధురై వారి శాఖ), జిల్లా అందత్వ నివారణ సంస్థ, తిరుపతి వారి సహకారంతో పెళ్లకూరులో ఉన్న చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ నందుగల నైపుణ్య శిక్షణ కేంద్రం వద్ద నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆదివారం ఉదయం ప్రారంభమైన ఈ శిబిరంలో కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులు సుమారు వంద మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి ఉచితంగా భోజనం ఏర్పాట్లు చేయడమే కాకుండా అవసరమైన వారికి మందులుతో పాటు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సీఈవో పి.సీతారామ నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ చాగణం లలితమ్మ భాస్కరరావు ట్రస్టు ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలతో పాటు ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నెల్లూరు, తిరుపతి జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో నిర్వహిస్తామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

సూళ్లూరుపేట, మార్చి 15 ప్రభాతవార్త: మండలంలోని మన్నారుపోలూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. మన్నారుపోలూరు గ్రామానికి చెందిన పోలూరు కాటమ్మ (65) అనే మహిళ రోడ్డు దాటుతుండగా శ్రీకాళహస్తి నుంచి సూళ్లూరుపేటకు వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కాటమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. బైక్‌పై ఉన్న సాయి (23), గంగాధర్ (25)లకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన శ్రీపతి బాబు



నాయుడుపేట, మార్చి 15 ప్రభాతవార్త : మండలంలోని మేనకూరు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శని వారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు అగస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని, వారికి అన్ని రకాల మెనూ తప్పకుండా పాటించాలని వార్డన్ కు సూచించారు. అనంతరం విద్యార్థులు ఉండే హాస్టల్ గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి బాత్రూంలను శుభ్రంగా ఉంచాలని వార్డెన్‌కు చెప్పారు. సోమవారం నుంచి జరగబోవు 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

## పేద మహిళలకు దుస్తులు పంపిణీ



నాయుడుపేట, మార్చి 15 ప్రభాతవార్త : నాయుడుపేటలోని 786 సేవా సంఘం ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు, నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రంజాన్ మాసం పురస్కరించుకుని 786 సేవా సంఘం వ్యవస్థాపకులు, నాయుడుపేట టీడీపీ పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ చేతుల మీదుగా నిరుపేద కుటుంబాల ఆడపడుచులకు చీరలు, మరియు నిత్యవసర సరుకులను అధ్యక్షులు పంపిణీ చేశారు. 786 సేవా సంఘం తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈ క్రమంలోనే పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సేవా సంఘం తరపున పేదలకు నిత్యవసర సరుకులు, చీరలు అందించడం జరిగిందని వారు ఈ సందర్భంగా రఫీ తెలియజేశారు.

## పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు : సీఐ



వెంకటగిరి, మార్చి 15 ప్రభాతవార్త : ఈ నెల 16వ తేదీ నుండి ఏప్రిల్ నెల ఒకటో తేదీ వరకు జరగబోవు పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీఐ ఏవి రమణ తెలిపారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ,పోలీసులు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ పాల్పడరాదని సూచించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని తెలిపారు. అత్యధిక మార్కులు రావాలని విద్యార్థులపై తల్లిదండ్రులు ఒత్తిడి తీసుకురాకూడదని సూచించారు. విద్యార్థులు కూడా మానసిక ఒత్తిడికి గురికాకూడదని తెలిపారు.

## వంటగ్యాస్ సరఫరాలో కొరత లేదు:తహసిల్దార్

వాకాడు, మార్చి 15 ప్రభాతవార్త: సాధారణంగానే వంట గ్యాస్ సరఫరా కొనసాగుతుందని, ప్రజలు ఎలాంటి భయపడాల్సిన అవసరం లేదని నిరంతరం వంటగ్యాస్ అందుబాటులో ఉంటుందని మండల తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులకు తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ ప్రకటన తెలియజేస్తూ రాష్ట్రంలోని వంట గ్యాస్ సరఫరా అందుబాటులో ఉందన్నారు, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. వంట గ్యాస్ సమస్య లేదని ప్రజలు నమ్మాలన్నారు.

## వేదిక్ విద్యాన్ పాఠశాల తొలి వార్షికోత్సవం




తిరుపతి విద్య మార్చి 15 ప్రభాతవార్త: వేదిక్ విద్యాన్ పాఠశాల స్థాపనకు సంవత్సరం పూర్తైన సందర్భంగా ఆదివారం నిర్వహించిన తొలి వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల కేరింతలు, రంగురంగుల అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ హాస్య కార్యక్రమం జబర్దస్త్ టీమ్‌కు చెందిన హైపర్ ఆది, శాంతి స్వరూప్, దొరబాబు పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాల ఛైర్మన్ మహేష్, కరస్పాండెంట్ పుష్పలత ముఖ్య అతిథులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా స్వాగతించారు. సభలో ఛైర్మన్ మహేష్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో నాణ్యమైన విద్య అత్యంత ముఖ్యమైంది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి" అని అన్నారు. అలాగే శాంతి స్వరూప్ , దొరబాబు కూడా విద్యార్థులతో కలిసి సరదాగా గడిపి కార్యక్రమానికి ఉత్సాహాన్ని నింపారు. కరస్పాండెంట్ పుష్పలత మాట్లాడుతూ పాఠశాలలు విద్యతోపాటు క్రమశిక్షణ, సంస్కారం, మానవీయ విలువలు నేర్పడంలో ముందుండాలని సూచించారు. తరువాత విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, దేశభక్తి గీతాలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చదువులో, క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిని అతిథులు అభినందించారు. మొత్తంగా వేదిక్ విద్యాన్ పాఠశాల తొలి వార్షికోత్సవం విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచి అందరికీ చిరస్మరణీయంగా మారింది.

## 3వ రోజుకు చేరిన కార్మికుల రిలే దీక్షలు



నాయుడుపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య విభాగంలో నాన్ ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు 8నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నాయుడుపేట మున్సిపల్ ఆఫీస్ ముందు కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీపల్లి చెంగయ్య సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుంద మాట్లాడుతూ గత 8 నెలలగా జీతాలు రాకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలుమార్లు కమిషనర్ను కలిసిన అర్జీలు ఇచ్చిన పట్టించుకోకపోవడంతో మున్సిపాలిటీ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలకు దిగాల్సి వచ్చిందని అన్నారు. వాహనాలు కండిషన్లో లేవని, సేఫ్టీ పరికరాలు ఇవ్వడం లేదని అన్నారు. ఉద్యోగ భద్రత పెండింగ్ వేతనాలు ఇవ్వాలని లేని పక్షంలో ఈ రిలే నిరాహార దీక్షలు ఉధృతం చేస్తామని వారు అన్నారు ఈ కార్యక్రమంలో రాజేష్, అనిల్, అజయ్, వాసు, రమణయ్య, రమణమ్మ, వెంకటసుబ్బయ్య, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో మంత్రి డోలా



కాణిపాకం, మార్చి 15 ప్రభాతవార్త: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఆధ్వర్యంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఆలయ సూపరెండెంట్ వాసు, తదితరులు టీడీపీ నాయకులు మధుసూదన్‌రావు, నరసింహులు నాయులు, శేషాద్రినాయుడు, హేమాద్రినాయుడు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు తదితరులుపాల్గొన్నారు.

## భక్తితో అన్నమయ్యవిగ్రహానికి... వంశీకులచే అభిషేకాలు



తిరుమల, మార్చి 15ప్రభాతవార్తప్రతినిధి: పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య 523వ వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అన్నమయ్య విగ్రహానికి వంశీకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు .తిరుమల లేపాక్షి కూడలిలో ఉన్న అన్నమయ్య వినరగహానికి ఆ వంశీకులు అన్నమయ్య, రాఘవ, 12వ తరానికి చెందిన తాళ్లపాక పవన్ ,భరద్వాజ్ ,తాళ్లపాక హైగ్రీవ నారాయణ చార్యులు, కంచి రాజేష్ ,ప్రేమ్ కుమార్, బెంగళూరు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆద్యంతం వేదోక్తంగా చాలా అద్భుతంగా రాఘవ ఆధ్వర్యంలో జరిపించారు. సిద్దిపేటకు చెందిన పవన్ బృందం ,వైజాగ్ బృందం ,సింగపూర్‌బృందం కళాకారులు కలిసి సంకీర్తన సేవ చేశారు .

## పది పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

### -పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ -జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి, మార్చి 15పభాతవార్త: తిరుపతి జిల్లా వ్యాప్తంగా నేటి నుండి మొదలవుతున్న పదవ తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా, మానసిక ధైర్యంతో పరీక్షలు రాయలన్నారు. జిల్లాలో సోమవారం నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా , సజావుగా నిర్వహించేందుకు పోలీస్ అధికారులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామ న్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షి స్తూ విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 165 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ తరపున కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పరీక్షా కేంద్రాలు ఉండే సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయాలని సూచనలుచేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

## గాజులమండ్యం పోలీసులకు... బెస్ట్ క్రైమ్ డిటెక్షన్ అవార్డులు




రేణిగుంట, మార్చి 15ప్రభాతవార్త: రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని రూరల్ సర్కిల్ గాజులమండ్యం పోలీసులు ఓ హత్య కేసును సమర్థవంతంగా చేదించినందుకు రాష్ట్రస్థాయిలో అవార్డును కైవసం చేసుకున్నారు. వివరాలు ఇలా 2025వ సంవత్సరం గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. హత్య చేసిన వ్యక్తులు, హత్య కాబడిన వ్యక్తి ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించలేకపోయారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో రూరల్ సీఐ మంజునాథరెడ్డి రెడ్డి, అప్పటి గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తమ క్రైం పార్టీ సిబ్బందితో కేసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో హత్య కాబడిన వ్యక్తినీ గుర్తించి హత్య చేసిన వ్యక్తులను పట్టుకొని రిమాండ్ కు పంపారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరిచిన రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, సీఐ మంజునాథరెడ్డి, ఎస్సై సుధాకర్ సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందిస్తూ రివార్డుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. వీరికి అక్టోబర్ డిసెంబర్ త్రైమాసికానికి గాను ఏబిసిడి (అవార్డు ఫర్ బెస్ట్ ఇన్ ద క్రైమ్ డిటెక్షన్) అవార్డులను రాష్ట్రస్థాయిలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా ఎస్పీ సుబ్బరాయుడు సమక్షంలో అందుకున్నారు.

## నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ బకాయిలపై ప్రభుత్వం దృష్టి

### - రైతులతో కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త: నింద్ర మండల పరిధిలోని నేతమ్స్ షుగర్స్ ప్రైవేట్ లిమిటెడ్ బకాయిల అంశంను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి బకాయిలు చెల్లించడానికి కృషి చేస్తానని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని నాగార్జున ఐఎఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని రైతులు, ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిల వసూళ్ళపై సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ రైతులు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను త్వరితంగా వసూలు చేసి చెల్లించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్‌కు సంబంధించిన బకాయిల వసూళ్ళ కోసం అవసరమైన న్యాయపరమైన చర్యలను హైదరాబాద్ లోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ ద్వారా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు, ఉద్యోగులకు రావాల్సిన మొత్తాలను త్వరగా చెల్లించేలా చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతులకు రూ.35.92 కోట్ల పెండింగ్ బకాయిలు వున్నాయని, అలాగే ఉద్యోగులకు రూ.13 కోట్లు బకాయిలు వున్నాయని పేర్కొన్నారు. ఈ బకాయిలను వీలైనంత త్వరగా వసూలు చేసి సంబంధిత లబ్ధిదారులకు చెల్లించేలా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా క్రేన్ కమీషనర్ జి.ముత్యాలు, రైతు సంఘం నాయకులు ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులు, ఉద్యోగ సంఘ నాయకులు భాస్కర్‌రెడ్డి, సంపత్‌కుమార్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సరస్వతీ పూజకు వస్తూ... మృత్యు వాత

### - మోటారు సైకిల్‌పై ప్రయాణించిన ముగ్గురు విద్యార్థులు

### -ఒకరి దుర్మణం, చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థులు

శ్రీకాళహస్తి రూరల్, మార్చి 15పభాతవార్త: శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు సరస్వతి పూజా కార్యక్రమం నిర్వహించారు. అదే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రామలింగాపురం, పుల్లారెడ్డికండ్రిగక చెందిన ముగ్గురు విద్యారు మోటార్ సైకిల్‌పై పాఠశాలకు వస్తున్నారు. వారు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ అదుపు తప్పి ప్రక్కనే వున్న ఓ చెట్టుకు ఢీ కొనడంతో రామలింగాపురంకు చెందిన రేవంత్ అనే పదవ తరగతి విద్యారి గాయపడ్డి, హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మిగిలిన ఇద్దరిలో ఒకరు స్విమ్స్‌లో, మరొకరు స్వాతి హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నట్లు వివరించారు. ఈ విద్యార్థుల ప్రమాదంతో సరస్వతిపూజ విషాదంగా మారిందని, మోటార్ సైకిల్ ప్రయాణం ఎంతో ప్రమాదం అని అంటున్నా, ఉపాధ్యాయులు, పోలీసులు, తల్లిదండ్రులు మోటార్ సైకిల్ ప్రయాణం వద్దు అన్నా, వినకుండా ఇలాంటా మరణాలు కొని తెచ్చుకుంటున్నారు. రేవంత్ అనే విద్యార్థి ఆ పాఠశాలలో ప్రథమ స్థానంలో వుంటాడని, అలాంటి విద్యార్థి దుర్మణం పాలుకావడంతో ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం మౌనముద్రలో మునిగిపోయారు.


మృతి చెందిన రేవంత్

## ప్రతిభావంతులకు రంజాన్ తోఫా అందించిన హెల్పింగ్ హ్యాండ్స్

శ్రీకాళహస్తి,మార్చి 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సారథ్యంలో ఆదివారం ముస్లింలకు రంజాన్ తోఫాను అందించారు. సంస్థ వ్యవస్థాపకులు మునీర్ బాషా సారథ్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు వన్‌టౌన్ సిఐ ప్రకాష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎన్నో చోట్ల పని చేసానని అయితే స్వచ్ఛంద సేవా సంస్థల ముసుగులో వ్యాపారం సాగుతుందని అయితే ఇక్కడ హెల్పింగ్ హ్యాండ్స్ సేవా కార్యక్రమాలు పరిశీలించిన తరువాత నిర్వాహకుడు మునీర్‌బాషా సమాజం పట్ల చూపుతున్న శ్రద్ధ ఆయన ఆచరిస్తున్న విధానాలు అభినందనీయం అన్నారు. ఒకటి రెండు కాదు 171 నెలలుగా ఆయన క్రమం తప్పకుండా దివ్యాంగులకు అందిస్తున్న సహాయ సహకారాలు ఎంత ప్రశంసించినా తక్కువే అన్నారు. ఆదివారం నాటి కార్యక్రమాల్లో శ్రీకాళహస్తిలో పేరుగాంచిన సుధా మెడికల్స్ నిర్వాహకులు హబీబ్ తన వ ంతు సహాయంగా 50మందికి రంజాన్ తోఫాలో పండగకు ఉపయోగించే వంట సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా సిఐ ప్రకాష్ మాట్లాడుతూ ఏ కులమైనా,ఏ మతమైనా తనకు ఉన్న దాంట్లో ఏంతో కొంత నిరుపేదలు, దివ్యాంగులకు సహాయం అందించాలని 171 నెలలుగా క్రమం తప్పక అందించటం అనేది మహోన్నతాశయం అన్నారు. మునీర్ బాషా తన సంపాదనలో కొంత దానం చేయటం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమాల్లో న్యాయవాదులు గుమ్మళ్ళ రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, బాబాఫరీద్ హరి, సతీష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఉన్న రోడ్డును తవ్వేశారు! ప్రయాణం నరకం చేసారు!!

శ్రీకాళహస్తిరూరల్,మార్చి 15 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి మండలంలోని రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారాయి. ముఖ్యంగా శ్రీకాళ హస్తి- ముచ్చివోలు-పల్లం రోడ్డు పరిస్థితి ఆశ్చర్యపరు స్తుంది. గత ప్రభుత్వ హా యంలో కోట్లు పెట్టి రోడ్డు వెడల్పు చేసినట్లు బిల్లులు చేసుకున్నారు.అయితే రోడ్డు వెడల్పుకు మెటీరియల్‌ను తరలించి చేతులు దులుపుకున్నారు.ఇక శ్రీకాళహస్తి నుంచి సుమారు 4 కిలో మీటర్ల వరకు ముచ్చివోలు రోడ్డుకు వెళ్ళటానికి గతంలో తారు రోడ్డు ఉండేది. ఈ రోడ్డు అటు వెంకటగిరి ఇటు తొట్టంబేడు మండలంలోని కాసరం,చొడవరం తదితర గ్రామాలకు వెళ్ళే రోడ్డుకు లింక్ రోడ్డుగా ఉంది.శ్రీకాళహస్తి నుంచి దొమ్మరమిట్ట క్రాస్‌రోడ్డు వరకు ఉన్న తారు రోడ్డును కొత్త రోడ్డు నిర్మించటానికి ఏమో తవ్వేశారు. రోడ్డును వేయటం అభినందనీయమే కానీ ఉన్న రోడ్డును తవ్వేసి వదలిపెట్టారు.దాంతో ఈ రోడ్డుపై లారీలు, ట్రాక్టర్లు, బస్సులు,కార్లు ముఖ్యంగా ద్విచక్రవాహనాల గమనం ప్రశ్నార్థకంగా మారింది. ప్రజల బాధలను ఎన్ని సార్లు పాలకులకు విన్నవించినా పరిష్కారం కావటం లేదు. ఇక అధికారులు అందుబాటులో ఉండటం లేదు.దాంతో ఈ రోడ్డులో వెళ్ళు వాహన చోదకులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రాణాలరచేతిలో పెట్టుకొని పయనిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు ఈ రోడ్డు దుస్థితిని గుర్తించి బాగు చేయాలని కొత్త రోడ్డు నిర్మించి బాధలను తప్పించాలని కోరుతున్నారు.

## అంధకారంలో మయూర్ నగర్

తొట్టంబేడు, మార్చి 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి సమీపంలోని కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. 2007 నుంచి రాజీవ్‌నగర్, కైలాసగిరికాలనీ,టైలర్స్ కాలనీ, టైలర్స్‌కాలనీ,మయూర నగర్‌లు ఉన్నాయి.కాలనీలు అయితే పెరిగాయి. మున్సిపాలిటి పన్నుల వసూళ్ల చేసుకుంటుంది.కానీ ఇక్కడ నివాసముంటున్న ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించటంలో చొరవచూపటం లేదు.దాంతో ఈ ప్రాంతాల ప్రజలు మంచి రోడ్లు లేక తాగటానికి మంచినీరు లభించక పొద్దుగుంకితే బయటకు రావాలంటే ప్రాణాలరచేతిలో పెట్టుకొని పయనించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక్కడ వేలాది మంది ప్రజలు నివాసముంటున్నారు.ఈ కాలనీల్లో ఇతర సదుపాయాలు మాటేలా ఉన్నా సాయంత్రమైతే వీధి లైట్లు వెలగటం లేదు. దాంతో విద్యుత్ స్థంభాలపై ఎల్ఇడి లైట్లు దిష్టిబొమ్మల్లా మారాయి.ఇక్కడ మున్సిపాలిటి పర్యవేక్షణ లేక ఏపుగా ముళ్ళ చెట్లు పొదలుగా మారాయి. అంతేకాక ఇక్కడే వెంకయ్యస్వామి గుడి ఉంది. ఇక్కడే జర్నలిస్టు కాలనీ ఉంది. కానీ కనీస సదుపాయాల్లేక తల్లడిల్లుతున్నారు. కనీసం వీధి లైట్లు అయినా వెలిగించాలని కోరుతున్నారు. అసలే ఎండా కాలం పాముల బెడద ఎక్కువగా ఉంది. మున్సిపల్ అధికారులు నీటి పన్ను ఆస్తిపన్ను అంటూ పీడిస్తున్నారు తప్ప ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించటంలో చొరవ చూపటం లేదు. ఇప్పటికైనా మయూర్ నగర్‌లో వీధి దీపాలు వెలిగించి పుణ్యం కట్టుకోవాలని కోరుతున్నారు.

## పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి..

తిరుపతి,మార్చి 15 ప్రభాతవార్త:



నగరపాలక సంస్థ కార్యాలయంలో నేడు నిర్వహించే "డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక "ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు 0877 2227208 నంబర్‌కు మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ మౌర్య తెలియజేశారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేసే ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ కోరారు.

## నేడు డయల్ యువర్ సిఎండి

తిరుపతి,మార్చి 15పభాతవార్త:



తిరుపతి ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమం" నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ సిఎండి సిఎండి శివశంకర్ లోతేటి స్వయంగా పాల్గొని వినియోగదారుల సమస్యలపై పరిష్కారం చూపుతారు. వినియోగ దారులు 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్య లను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

## కళత్తూరు యువకుడికి జాతీయ రికార్డు

కేవీబీ పురం, మార్చి 15 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలం కళత్తూరు గ్రామానికి చెందిన యువకుడు కనపర్తి అభిరామ్ శారీరక దృఢత్వ సాధనలో జాతీయస్థాయిలో రికార్డు నెలకొల్పాడు. ప్రముఖ వ్యాపారవేత్త కనపర్తి మధుసూదన్‌రెడ్డి కుమారుడు అభిరామ్ క్రమశిక్షణతో సాధన చేసి ఈ ఘనత సాధించాడు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నంలోని గీతం విశ్వ విద్యాలయంలో ఆర్కిటెక్చర్(వాస్తు శిల్పం) విద్యను అభ్యసిస్తున్నారు. నాలుగు కిలోల డంబెల్స్‌తో నిర్వహించే మణికట్టు తిప్పుడు విభాగంలో అభిరామ్ ఒక నిమిషంలో 85 సార్లు పూర్తి చేసి జాతీయ రికార్డు నమోదు చేశాడు. అదే విభాగంలో మణికట్టు మలుపుల విభాగంలో ఒక నిమిషంలో 170 సార్లు పూర్తి చేసి మరో రికార్డు సాధించాడు. నిర్దిష్ట సాంకేతిక ప్రమాణాల ప్రకారం నిర్వహించిన పరిశీలనల అనంతరం ఈ ప్రయత్నాలు ధృవీకరణించబడినట్లు నిర్వాహకులు తెలిపారు. అభిరామ్ సాధించిన ఈ విజయంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ కుమారుడు జాతీయ స్థాయిలో రికార్డు సాధించడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా సన్మానం

శ్రీకాళహస్తి,మార్చి 15 ప్రభాతవార్త




శ్రీకాళహస్తిలో ఆదివారం పెన్షనర్స్ దినోత్సవంను విశ్రాంత ఉద్యోగుల సంఘం సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సత్కరించారు. వారి తల్లి ఉపాధ్యాయురాలు కాబట్టి ఆమె పేరుతో రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానించారు. అంజూరు సరోజనమ్మ జ్ఞాపకార్థం పదవి విరమణ చేసి 15 సంవత్సరాలుపూర్తి చేసుకున్న ఉద్యోగులను ఆయన సత్కరించారు. ప్రతి ఏటా ఆనవాయితిగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. విశ్రాంత ఉద్యోగులను ఆయన సత్కరించగా తమ సేవలను గుర్తుపెట్టుకొని ప్రతి ఏటా సత్కరిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులను విశ్రాంత ఉద్యోగులు సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యోగుల సంఘాధ్యక్షులు బి.వెంకయ్య, ఉపాధ్యక్షులు పురుషోత్తం గౌడ్, ప్రధాన కార్యదర్శి పి.వి ప్రసాద్, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్య సిఎం దృష్టికి తెస్తా

తొట్టంబేడు,మార్చి 15 ప్రభాతవార్త



విశ్రాంత ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు దృష్టికి తెచ్చి పరిష్కరించుటకు కృషి చేస్తానని రిటైర్డ్ ఉద్యోగులను తమ కుటుంబపెద్దలుగా అభిమానిస్తానని ఆదరిస్తానని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రిటైర్డ్ ఉద్యోగులు,పెన్షనర్ దినోత్సవం సందర్భంగా సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.మండలంలోని చెంచులక్ష్మీ కాలనీలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం అధ్యక్షుడు బి.వెంకయ్య అధ్యక్షతన 'పెన్షనర్స్ దినోత్సవాన్ని' నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షులు జయరామానాయుడు మాట్లాడుతూ నేడు ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని ఎంఎల్ఏ దృష్టికి తెచ్చారు. విశ్రాంత ఉద్యోగులను ప్రభుత్వం 'పెద్ద కొడుకులా' చూసుకోవాలని మట్టి ఖర్చుల కింద పెన్షన్ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ అంశాలను ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళి మంజూరు చేసేటట్లు చేయాలని కోరారు. సంఘాధ్యక్షుడు బూడిదవాకం వెంకయ్య మాట్లాడుతూ ఉద్యోగులు, దాతల సహకారంతో జిల్లాలోని మొట్టమొదటి సారి విశ్రాంత ఉద్యోగుల యూనియన్ భవనాన్ని నిర్మించుకున్నామని వివరించారు. అలాగే గత ప్రభుత్వం నిర్వాకంతో రివర్స్ పిఆర్‌సి ఐర్ అందుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు సానుకూల ప్రభుత్వం అని భావిస్తున్నట్లు వివరించారు.గతంలో తాము కోల్పోయిన పిఆర్‌సి, ఐఆర్‌పి పునురుద్ధరణ చేయాలని కోరారు. విశ్రాంత ఉద్యోగి మరణిస్తే ఒక నెల పెన్షన్‌ను మట్టి ఖర్చులు కింద ఇవ్వాలన్నారు.

### అవకాశం ఇచ్చారు అందరికి అండగా ఉంటా!

ఈ సందర్భంగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ బొజ్జల కుటుంబ వారసుడుగా నన్ను గెలిపించుటకు ఉద్యోగులు,రిటైర్డ్ ఉద్యోగులు ఎంతో సహకరించారని వారి మేలు జన్మజన్మలకు మరువనన్నారు. ఎందరో మేధావుల కలయిక కల్గిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘంలో ఎన్నో సూచనలు చేసారన్నారు. ప్రజలకు సంబంధించి ప్రతి అంశాన్ని తాను ఛాలెంజ్‌గా తీసుకొని పరిష్కరిస్తామన్నారు.నియోజకవర్గఅభివృద్ధికి ఎవరు ఏ సూచనలు చేసినా తీసుకుంటానని వివరించారు. ఈ సందర్భంగా సంఘ తరఫున ఎఎల్ఏ సుధీర్‌రెడ్డిని సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా నాయకులు సిద్దయ్య, చెంగల్‌రాయులు, చంద్రశేఖర్ మోహన్, ఏ,భాస్కర్‌రావు,రాష్ట్ర కార్యదర్శి కృపావరమ్మ, ఎన్‌జివోల సంఘాధ్యక్షుడు చెంచురత్నం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సేవలకు సత్కారం : జవాబుదారితనానికి గుర్తింపు

శ్రీకాళహస్తి, మార్చి 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ప్రజల సేవలో ఎంతోకాలం సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులను ఆదివారం జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా సత్కారం జరిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘాధ్యక్షుడు బి.వెంకయ్య సారథ్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమాలకు ఈ సన్మానానికి ఇతోధికంగా మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరుతారక శ్రీనివాసులు,పట్టణంలో పేరెన్నిక గన్న డాక్టర్ లక్ష్మీనారాయణ సహకరించారు. ఈ సభలో శాసనసభ్యుడు బొజ్జల వవెంకటసుధీర్‌రెడ్డి సారథ్యంలో సన్మానించారు. 73 సంత్సరాలు నిండిన సభ్యులను సత్కరించారు. సత్కారం అందుకున్న వారిలో ఓమధుసూదన్, ఎ.పురుషోత్తం గౌడ్, జే.జీవరత్నమ్మ, ఎస్ రాధాకృష్ణమూర్తి, పి.సత్యనారాయణరావు, కె.చలపతి, ఎం.రంగారావు,,ఎస్ పద్మనాభం, టి.కె గోవిందరాజన్, కె.రామ్‌బత్తిరెడ్డి, బోడా గంగయ్య, ఎ.తాతయ్య, ఎస్,కృష్ణమ్మ, ఎస్ మహమూద్, పి.రమణయ్యనాయుడు, టి.ఎస్ భారతి, కె.శంకర్‌రెడ్డి, బి.ఎస్.పార్థసారథి, సి.సుబ్రమణ్యం, యం.ఇందిరమ్మ, ఉత్తరాజి రాధాకృష్ణయ్య, ఇక్బాల్ హుసేన్, ఎం.నళిని, వి.సుబ్బరామిరెడ్డి, వి.రామమోహన్‌వర్మ, ఎస్ అబ్దుల్ సత్తార్, కల్వాల శ్రీనివాసులు, పిఆర్ సుధాకర్‌బాబు, ఎం.మునికృష్ణయ్య, ఎస్ సుబ్రమణ్యం, జే.మునిభూషణం, ఎం.ప్రకాష్‌లను సంఘం తరఫున ఎంఎల్ఏ సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఎపిఎన్‌జిఓ ల సంఘాధ్యక్షుడు చెంచురత్నం యాదవ్, నాల్గవ తరగతి ఉ ద్యోగుల సంఘా గౌరవాధ్యక్షులు రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ మునీంద్రయ్య, రాష్ట్ర నాయకులు జయరామానాయుడు,తిరుపతి జిల్లా నాయకులు కెఆర్ శంకర్, ప్రధానకార్యదర్శి జయరామానాయుడులు పాల్గొన్నారు. సమావేశానికి స్థానిక అధ్యక్షుడుబూడిదవాకం వెంకయ్య అధ్యక్షత వహించారు. ఏర్పాట్లును ప్రసాద్,రమణయ్య, సుబ్రమణ్యం రెడ్డి, పయని,గుణశేఖర్ జమృద్‌బాషా, భక్తవత్సలయ్య, దుర్గా ప్రసాద్, మునిసుబ్బారెడ్డి తదితరులుపర్యవేక్షించారు.

## శివయ్య సేవలో సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి

శ్రీకాళహస్తి,మార్చి 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఇఓ బికె వెంకటేశు ప్రోటోకాల్ ఎఇఓ మోహన్,ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి గురించి వాకబు చేసారు. గతంలో కూడా ఆలయ దర్శనానికి



వచ్చిన ఆయన ఈ సారి ఆలయంలో ఏర్పాట్లు బాగుతన్నాయని ప్రశంసించారు. ఆయనకు ఇఓ వెంకటేశు వ్యక్తిగతంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు. వారికి అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. అలాగే ఇఓ వెంకటేశు స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు. స్వాగతం పలికిన వారిలో ట్రస్టుబోర్డు సభ్యులు రజని, గోపినాథ్ ఉన్నారు. ఏర్పాట్లును ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్సెపెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం నాయుడులు పర్యవేక్షించారు.

## నేటి నుండి ఒంటి పూట బడులు ప్రారంభం: డి ఈ ఓ

తిరుపతి విద్య, మార్చి 15 ప్రభాతవార్త



జిల్లాలో నేటి నుండి పాఠశాలల్లో ఒంటి పూట బడులు అమల్లోకి వచ్చినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ తెలిపారు. ఉదయం 7.30 గంటల నుండి 12.30 గంటల వరకు మాత్రమే క్లాసులు నిర్వహించాలని అన్ని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశారు.డి ఈ ఓ కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ"వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం మా ప్రాధాన్యం. మధ్యాహ్నం వేడి ప్రమాదకరంగా మారే అవకాశం ఉండటంతో, నేటి నుండి ఒంటి పూట బడులు అమలులోకి తెచ్చాం. అన్ని పాఠశాలలు తాగునీరు, వెంటి లేషన్, ఫ్యాన్స్ వంటి సదుపాయాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి" అని తెలిపారు.అలాగే విద్యార్థులు ఇంటి నుంచి సరి సమానంగా నీటిని తీసుకురావాలని, గోరువెచ్చని గాలులు ఎక్కువయ్యే సమయాల్లో బయట తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచిం చారు.తల్లిదండ్రులుకూడా పాఠశాల సమయాల్లో మార్పును సానుకూలంగా స్వాగతిస్తు న్నారు.ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరేవరకు ఈ ఒంటి పూట బడులు కొనసాగనున్నట్లు డి ఈ ఓ కుమార్ తెలిపారు.

## శాస్త్రీయ జ్ఞానాన్ని ప్రజలకు చేరవేయాలి

తిరుపతి విద్య. మార్చి 15 ప్రభాతవార్త



విద్యార్థులు శాస్త్ర జ్ఞానాన్ని సంపాదించి ప్రజలకు చేరవేయాలని, ధార్మిక విషయాలను అర్థమయ్యే రీతిలో వివరిస్తూ ధర్మసంరక్షణ కొరకు కృషి చేయాలని శ్రీ శారదా పీఠం జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృత వర్సిటీని ఆదివారం సందర్శించి, అనంతరం వర్సిటీ రామారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో జరిగిన వేదసభకు ఆయన ముఖ్యఅలతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సంస్కృత అధ్యయన, అధ్యాపనంలో అగ్రగామిగా ఉన్న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఎంతోమంది విశిష్ట శాస్త్రపండితులతో విరిసిల్లుతుందని, ఇక్కడ అధ్యయనం చేస్తున్న విద్యార్థులు భాగ్యవంతులు అన్నారు. ప్రత్యేకించి సంస్కృతం అధ్యయనం చేస్తూ జ్ఞానాన్ని, భారతీయ ధర్మ ఔన్నత్యాన్ని ప్రజలకు తెలియజేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఆధ్యాత్మిక భక్తిని, గురుభక్తిని కలిగి సన్మార్గంలో జీవిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. ప్రతి వ్యక్తి ధర్మాన్ని పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా పండితులకు, అధ్యాపకులకు, విశ్వవిద్యాలయ ఉద్యోగులకు, విద్యార్థులకు ఆయన ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, డాక్టర్ నిరంజన్ మిశ్రా, విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్.వి ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవాశిబిరం

తిరుపతి విద్య, మార్చి 15 ప్రభాతవార్త




టి.టి.డి ఆధ్వర్యంలోని ఎస్.వి ఆర్ట్స్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ కార్యకర్తలచే ప్రత్యేక సేవా శిబిరం మార్చి 9వ తేదీ నుండి మార్చి 15వ తేదీ వరకు తిరుపతి నెహ్రూ నగర్‌లో నిర్వహించబడింది. ఈ శిబిరం ముగింపు కార్యక్రమం మార్చి 15వ తేదీ సాయంత్రం ఎస్.వి ఆర్ట్స్ కళాశాలలో జరిగింది.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాల్ రెడ్డి, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ వై. మల్లికార్జునరావు, ఎస్.వి యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ డైరెక్టర్ ఆచార్య దామోదరం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే కళాశాల ప్రోగ్రామ్ ఆఫీసర్లు రెడ్డెప్ప రెడ్డి, మధుసూదన్ రావు, ఎన్.ఎస్.ఎస్ కార్యాలయ సిబ్బంది దామోదరం , కళాశాల కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, "ఎన్.ఎస్.ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత పెరుగుతాయి. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనడం అభినందనీయం. ఇటువంటి శిబిరాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయి" అని తెలిపారు.వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ వై. మల్లికార్జునరావు మాట్లాడుతూ, "ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమాలు విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించడమే కాకుండా, సమాజానికి సేవ చేయాలనే బాధ్యతను కలిగిస్తాయి. ఇలాంటి ప్రత్యేక సేవా శిబిరాల ద్వారా విద్యార్థులు ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయగలుగుతారు" అని అన్నారు.అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

## శివయ్య సేవలో వెస్ట్ గోదావరి కలెక్టర్

శ్రీకాళహస్తి,మార్చి 15 ప్రభాతవార్త



పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి ప్రారంభం కావటంతో భక్తుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం వెస్ట్ గోదావరి కలెక్టర్ నాగమణి కుటుంబసమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.వారికి దక్షిణ గోపురం వద్దఆలయ ఇఓ బికె వెంకటేశు,ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవి వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.స్వామి అమ్మవార్ల దర్శనానంతరం మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు ఏర్పాటు చేసారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి,టెంపుల్ ఇన్సెపెక్టర్ వెంకటస్వామిలు పర్యవేక్షించారు.

## శివయ్యను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి,మార్చి 15 ప్రభాతవార్త



శ్రీజ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరుని ఆదివారం కేరళ హైకోర్టు జడ్జి జస్టిస్ పిఎం మనోజ్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. వారు స్వామి అమ్మవార్ల దర్శనానికి అంతరాయం ఏర్పాటు చేసారు. ఏర్పాట్లును ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్సెపెక్టర్ వెంకటస్వామిలు పర్యవేక్షించారు.దర్శనానంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

# అనారోగ్యంతో.. ఆత్మహత్య..!

గంగవరం, మార్చి 15 ప్రభాతవార్త :

కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది.గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా..తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా మాదనూరు సమీపంలోని వళ్ళీల్‌కార్‌పట్టకి చెందిన రాజ్‌వేలు(55)కు మండలంలోని గంగవరం పంచాయతీ మన్నార్‌నాయనిపల్లెకు చెందిన శ్రీమతి అనే మహిళతో వివాహం చేసుకుని అనంతరం కర్ణాటక రాష్ట్రం కెఆర్ పురం నందు నివాసం ఉంటున్నారు.రాజ్‌వేలు వృత్తి రిత్యా కార్పెంటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం అత్తగారి స్వగ్రామానికి వచ్చాడు. రాజ్‌వేలు తరచూ కడుపునొప్పి,ఆస్మా వ్యాదితో బాధపడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.ఆదివారం తీవ్ర కడుపునొప్పి రావడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.అయితే ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.మృతునికి ఒక కుమార్తె,ఒక కుమారుడు సంతానం.

# పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎంఈవో

## 7 పరీక్షా కేంద్రాల్లో పరీక్షకు హాజరు కానున్న 1250 మంది విద్యార్థులు

పుత్తూరు రూరల్, మార్చి 15 ప్రభాతవార్త:

నేటి నుంచి పది పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే విద్యార్థులు తర్ఫీదు పొంది పరీక్షలకు సిద్ధంగా ఉన్నారు. మండలంలో పరీక్షలు రాయనున్న 1250 మంది విద్యార్థులకు గాను ఏడు పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశారు. ఆదివారం పరీక్షా కేంద్రాలను ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయం పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. తరగతి గదుల్లో ఏర్పాట్లను పరిశీలించారు. మాస్ కాపీయింగ్ తావు లేకుండా అలాగే పరీక్షలు జరిగే సమయంలో ఇతరులు ఎవరు కూడా లోపలికి రాకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రం నలువైపులా కట్టుదిట్టమైన భద్రత ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ఈ సారి నేరుగా విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచే నిర్వహిస్తున్నారు. డీవోలు, సీఎస్‌లు, ఎస్‌వోలను ఇప్పటికే నియమించారు.

### నగరిలో 7 సెంటర్‌లో పరీక్షలు

సోమవారం నుంచి జరగనున్న పది పబ్లిక్ పరీక్షలకు నగరి మున్సిపల్, రూరల్ మండల ప్రాంతంలోని పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పుదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తమిళం), సత్రవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నగరి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడుకుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం ఏడు పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 1250 మంది విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షలను రాయనున్నారు. వీటిలో ఒక కేంద్రాన్ని సమస్యాత్మక కేంద్రంగా గుర్తించారు. ఆ కేంద్రంలో సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. నగరిలో పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150, పుదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తమిళం) 200, సత్రవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 240, నగరి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 200, ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 240, తడుకుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 120, శ్రీచైతన్య ఉన్నత పాఠశాల 100 మంది విద్యార్థులు.

# వివాహిత అనుమానాస్పద మృతి

తిరుపతి,మార్చి 15పభాతవార్త:

తిరుపతినగరంలోని గిరిధర్ దాస్ లైన్ లో ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆదివారం ఉదయం ఈ ఘటన వెలుగుచూసింది. ఈస్టు పోలీసుల కథనం మేరకు.. .గిరిధార్‌దాస్ లేన్‌లోని ఓ ఇంట్లో మహిళ మృతి చెందినట్లు ఇంటి యజమాని రవీంద్రబాబు ,విఆర్‌ఓమురళికి సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్ఐ హేమాద్రి ,సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. మరిబోయిన చైతన్య (26 ),భర్త మెరిబోయిన మోహనరంగా కంభం మండలం ప్రకాశం జిల్లా అని తెలిసింది. ఆమె భర్తతో విడిపోయి తిరుపతికి చేరుకుంది. స్థానికంగా సుబ్బయ్యతో గత నెల 24వ తేదీ నుంచి ఇక్కడే ఉంటూ ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. అనుమానాస్పదంగా మృతి చెందినట్లు వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఈస్టు సిఐ శ్రీనివాసులు తెలిపారు.

# నేటి నుండి 'రైతన్నా మీ కోసం' వారోత్సవాలు

## - కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరుహెల్త్, మార్చి 15 ప్రభాతవార్త:

జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో సోమవారం నుండి ఈ నెల 25వ తేదీ వరకు రైతన్నా మీ కోసం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంను బలోపేతం చేయడానికి, రైతు సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో సాగు పద్దతులపై అవగాహన, పంటల ప్రణాళిక, ఆధునిక సాంకేతికత, రైతులకు అవసరమైన సూచనలు, సలహాలపై అధికారులు అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయ అభివృద్ధికి ఊతం ఇచ్చే పంచ సూత్రాలతో పాటు ఎల్నినో నేపథ్యంలో ప్రాంతాల వారీగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సూచనలు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో నేల, నీరును సంరక్షించే వివిధ ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించనన్నారు. అలాగే వ్యవసాయ రంగంపై గల్ఫ్ యుద్ధ ప్రభావం, ఎల్నినో ఏర్పడనున్న నేపథ్యంలో ప్రతికూల అంశాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి రైతులను అప్రమత్తం చేయడానికి ఈ కార్యక్రమం దోహదపడనుంది.

# పాత్రికేయులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

## - అమర హాస్పిటల్ ఎండి గౌరినేని రమాదేవి

తిరుపతి హెల్త్, మార్చి 15, ప్రభాతవార్త

మంచి ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యవంతమైన జీవనం పొందవచ్చని అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, స్లీపింగ్ మెడిసిన్ వైద్య అన్నిపనురాలు డాక్టర్ గౌరినేని రమాదేవి అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం అమర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఫ్రీ మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ అనుక్షణం వార్తల సేకరణలో బిజీగా ఉంటూ అనేక ఒత్తిళ్లకు గురవుతున్న పాత్రికేయులు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే మొదట ఆహారపు అలవాట్లపై ఆధారపడి ఉంటుందన్నారు. డాక్టర్ వెంకట శివకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ దైయనందిన జీవితంలో నడక, యోగ, మెడిటేషన్ లాంటివి తప్పక అలవర్చుకోవాలని, అప్పుడే గుండె ఆరోగ్యంగా ఉంటుందని ఆయన సూచించారు.ఇందులో అమర హాస్పిటల్ వైద్యులు జనరల్ మెడిసిన్ డాక్టర్ వరుణ్, ప్రముఖ గైనకాలజిస్ట్ హిందూజ విద్మహే, యూరాలజీ డాక్టర్ మనోజ్, డాక్టర్ మేఘన పాల్గొన్నారు. దాదాపు 150 మంది పాత్రికేయులు, వారి కుటుంబసభ్యులకు వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమర హాస్పిటల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ ఆర్థో ప్లాస్టి సేవల పోస్టర్‌ను ఆవిష్కరించారు. దీని ద్వారా సాధారణ సర్జరీ ధరలకే రోబోటిక్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు అమర హాస్పిటల్ సిబిఓ వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షు, కార్యదర్శులు మురళి, బాలచంద్ర, అమర హాస్పిటల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వేణుగోపాల్, కార్పొరేట్ సేల్స్ హెడ్ పవన్ కుమార్, నర్సింగ్ సిబ్బంది, టెక్నిసన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు

## ప్రైవేటు పాఠశాలల అధ్యాపకులకు అవకాశం. ప్రభుత్వ సీనియర్ అధ్యాపకులకు చెక్, జూనియర్లకే చాన్స్. ఇన్విజిలేటర్లతో ప్రైవేట్ యాజమాన్యాలు భేర సారాలు?



రైల్వే కోడూరు టౌన్, మార్చి 15,ప్రభాతవార్త.

ఈనెల 16 సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పదవతరగతి పరీక్షలను నిర్వహించనుంది. దీనికిగాను ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. ఈ పరీక్షలు పర్యవేక్షణలో భాగంగా ఇన్విజిలేటర్లు గా ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు అవకాశం కల్పించారు. దీంతో సీనియర్ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు చెక్ పడింది. జూనియర్ ఉపాధ్యాయులకు మాత్రమే ఇన్విజిలేటర్ల ఛాన్స్ లభించింది. ఈ విషయం తెలుసుకున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇన్విజిలేటర్లుగా అవకాశం దక్కిన ఉపాధ్యాయుల వద్దకు గత రెండు మూడు రోజుల నుంచి క్యూలు కట్టి అధిక మొత్తం చెల్లించి తమ పిల్లలకు పరీక్షల్లో కాపీలు వ్రాయించేందుకు సహకరించాలని బాగానే భేరసారాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అవసరమైతే వారి బంధువులు, స్నేహితులు,వారు నివాసం ఉన్న పంచాయతీ గ్రామాలలో రాజకీయ నాయకులు,పెద్దల ద్వారా కూడా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిళ్లు చేసి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు కూడా తెలుస్తుంది. సాధారణంగా ఉపాధ్యాయులకు సంబంధించిన పిల్లలు చదివే పాఠశాలల్లో వారిని ఇన్విజిలేటర్లుగా వేయరాదు. అయితే ప్రస్తుతం ఈ అవకాశం ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చిన ఇన్విజిలేటర్లుకు దక్కినట్లు తెలుస్తుంది. దీంతో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ టీచర్లే అధికంగా ఉన్నారని, ప్రైవేటు ఇన్విజిలేటర్ల పిల్లలు ఉన్నారని, వారిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయడం తెలిసింది. వీరి జాబితాను కూడా గూగుల్ ద్వారా పంపినట్టు తెలిసింది. వీరిని కొంతమందిని పాఠశాలలు కూడా మార్చినట్లు తెలుస్తుంది.అయితే ఆ ప్రాంతాలలో ఉన్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వారు పనిచేసే యాజమాన్యాలతో చేతులు కలిపి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు కూడా తెలుస్తుంది. ఎలాగైనా ప్రైవేట్ పాఠశాలల పిల్లలకు వీలైనంత మేర కాపీలు రాసేందుకు సహకరించి, మంచి మార్కులు సంపాదించి, పాఠశాలల పేరు గొప్పగా ఉండి, వచ్చే యాడాదుల్లో అడ్మిషన్లు అధికంగా పొందేందుకు ప్రయత్నించి,ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం అడ్మిషన్ల నమోదు తగ్గించేందుకు ప్రైవేటు యాజమాన్యాలు బాగానే కృషి చేస్తున్నట్లు తెలుస్తుంది. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మెరుగైన క్వాలిటీ విద్యను అందించాలని కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జరిగే పదవ తరగతి పరీక్షల్లో కాపీలకు చోటు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని సెట్టింగు, ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో బాగా చదివిన విద్యార్థులకు మంచే జరుగుతుంది. అయితే దీనిని ముందే పసిగట్టిన కొంతమంది బడికి ఎగ్గొట్టే,సబ్జెక్టు టీచర్లు వారి వారి సబ్జెక్టుల్లో మార్కులు తగ్గకుండా చూపేందుకు ముందే కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను మంచి మార్కులతో కాపీలు వ్రాయించి, పాసు చేయిస్తామని, సిట్టింగు, ఫ్లయింగ్ స్క్వాడ్లకు, పోలీసులకు, కొంతమేర ముడుపులు ముట్టజెప్పితే వారు పరీక్షల్లో చూసి చూడనట్లు వెళతారని, ఒక్కొక్క పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి నుంచి 2000 రూపాయలు మొదలుకుని 3000 రూపాయలు వరకు పరీక్షల కాపీల కోసం వసూలు చేసినట్లు తెలుస్తుంది. దీనికిగాను రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలైన కోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు లలో ప్రభుత్వ పాఠశాలల నుంచి గత కొన్ని సంవత్సరాల నుంచి ఒక్కో పాఠశాలకు, ఒక్కో ఉపాధ్యాయుడికి ఈ బాధ్యతలు అప్పజెప్పి, ప్రతి ఏటా పరీక్షల కాఫీల పేర్లతో లక్షలాది రూపాయలు వసూలు చేయడం, కాపీలు వ్రాయించడం ఆనవాయితీగా మారింది. పరీక్షల ఇన్విజిలేటర్లుగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎలాంటి అవకతవకలకు పాల్పడినా వారిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేయడం జరుగుతుంది. అదేవిధంగా ఏ సబ్జెక్టులో విద్యార్థులు ఫెయిల్ అయినా ఆ టీచర్కు ఇంక్రిమెంట్ కట్ చేయటం కూడా జరుగుతుంది. అయితే ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు పరీక్షల ఇన్విజిలేటర్ల అవకాశం కల్పించడంతో కాపీల చిట్టాలు కూడా వీరే జేబుల్లో పెట్టుకొని వెళ్లి పరీక్ష కేంద్రాల్లో వారికి కావలసిన విద్యార్థులకు అందించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒకవేళ తెలిసినా పట్టుబడిన వీరుపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉండదు. ముందే మీరు అర్హత లేని వారు. దీంతో ఈ ఏడాది భారీగానే పరీక్షల్లో అక్రమాలు వెలుగు చూసే అవకాశాలు కనబడుతున్నాయి. రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఐదు మండలాలకు సంబంధించి 17 పరీక్ష కేంద్రాలు 3130 మంది విద్యార్థులు ఈనెల 16న సోమవారం 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు.రైల్వే కోడూరు 1169 మంది, ఓబులవారిపల్లి మండలంలో 633, పుల్లంపేట 375,చిట్వేలి 513,పెనగలూరు 443 మంది విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు వ్రాయనున్నారు.ఈ కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు ప్రైవేటు పాఠశాలల నుంచి అర్హత లేని ఉపాధ్యాయులను 27 మందిని నియమించినట్లు తెలుస్తుంది. వీరిని రద్దు చేసేందుకు ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలు బాగానే వ్యతిరేకిస్తున్నాయి. అయితే పరీక్షల సమయానికి ప్రభుత్వం వీరి పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని తెలియాల్సి ఉంది.

# 32 బీజాక్షరాలతో 32 వేల సంకీర్తనలు

## -అన్నమయ్య రచనలపై శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్





తిరుమల,మార్చి 15ప్రభాతవార్తప్రతినిధి:

పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు మంత్రోపదేశంలోని 32 బీజాక్షరాలతో ,32 వేల సంకీర్తనలు రచించారని అహోబిల మఠం 46వ మఠాధిపతి శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ తెలిపారు. అహోబిలం నరసింహస్వామివారి అనుగ్రహంతో అన్నమాచార్యులు దీక్ష పొంది మంత్రోపదేశం పొందారని వివరించారు.అన్నమయ్య 523వ వర్ధంతి వేడుకలు నారాయణగిరి ఉద్యానవనంలో ఆదివారం సాయంత్రం జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారి ఊంజల్‌సేవలో సప్తగిరి సంకీర్తనల గోష్టిగానంతో సప్తగిరులు పులకించాయి. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి మాట్లాడుతూ అన్నమాచార్యుల వర్ధంతిని టిటిడి నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. 1975లో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టును ప్రారంభించినప్పటి నుండి దాదాపు మూడు వేల సంకీర్తనలను రికార్డు చేసి ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసినట్లు చెప్పారు. ఆధునిక సమాజానికి అన్నమయ్య సంకీర్తనలు ఎంతో అవసరం ఉందని తెలియజేశారు. టిటిడి తరపున తాళ్లపాక వంశీయులను అదనపు ఈఓ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్, డైరెక్టర్ లత, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# అవిలాల చెఱువులోకి టైల్స్ వ్యరాలు

## -పర్యావరణానికి చేకూరనున్న ముప్పు



తిరుపతిరూరల్, మార్చి15 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అవిలాల చెఱువు మరెసారి కాలుష్య సమస్యతో చర్చనీయాంశంగా మారింది. ప్రముఖ టైల్స్ కంపెనీ చెందిన షోరూమ్ నుండి వస్తున్న వ్యర్థాలను చెఱువులోకి వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో చెఱువు నీరు కలుషితమవుతూ పర్యావరణానికి ముప్పుగా మారుతుందని గ్రామస్తులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం అవిలాల ప్రాంతంలో ఉన్న కజారియా సిరామిక్ కంపెనీ షోరూమ్ వద్ద నుంచి వచ్చే మలమూత్ర వ్యర్థాలు చెఱువులో కలుస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల చెఱువు చుట్టుపక్కల ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపించడంతో పాటు ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని వారు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి వారు సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. సమస్య తెలిస కూడా అధికారులు నిమ్మకు నీరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నానరని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అవిలాల చెఱువు తిరుపతి నగరానికి కీలకమైన జలవనరుగా గుర్తింపు పొందింది. దీనిని రాష్ట్రంలోనే నెంబర్ వన్ చెఱువుగా తీర్చిదిద్దటానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్న విషయం తెల్సిందే. ఇప్పటికైన పంచాయతీ అధికారులు స్పందించి చెఱువులోకి వ్యర్థాలు వదలకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## చిత్తూరు జిల్లాలో

# జనసేన పరిస్థితేంటీ!

## - నాయకుల్లో కన్పించని పవర్

చిత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త:

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా వున్న జనసేన పార్టీ చిత్తూరు జిల్లాలో అధికారంలో ఏ మాత్రం ప్రభావం చూపడం లేదు. జనసేన పార్టీకి చిత్తూరు జిల్లాకు ప్రత్యేకంగా నాయకత్వం లేకపోవడంతో జిల్లాలో జనసేన నాయకులకు ఏ మాత్రం పవర్ దక్కడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి నుండి జనసేన పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అలాగే ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడిగా డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ తిరుపతి నుండి కార్యకలాపాలు సాగిస్తున్నారు. చిత్తూరు నుండి జనసేన పార్టీ నాయకురాలిగా అరణి కవిత రాష్ట్ర జనసేన పొలిటికల్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నప్పటికీ చిత్తూరు జిల్లాలో జనసేన పార్టీలో ఆమె పాత్ర సైతం పరిమితంగా వుంటోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకున్న కొంత మంది నాయకులకు రాష్ట్ర స్థాయిలో జనసేన పార్టీ తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో వీరికి జనసేన పార్టీ తరపున పోటీ చేయడానికి అవకాశం లభించలేదు. పూతలపట్టు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీ కె.శివప్రసాద్, కుప్పం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీ నరేష్‌లకు మాత్రం నామినేటెడ్ పదవులు కట్టబెట్టినప్పటికీ ఆ పదవులు జనసేన పార్టీని క్షేత్ర స్థాయిలో ముందుకు తీసుకెళ్ళడానికి పనికి రావడం లేదు. పూతలపట్టు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీ కె.శివప్రసాద్, కుప్పం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీ నరేష్‌లకు శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు కార్యవర్గ సభ్యులుగా ప్రభుత్వం నామినేట్ చేసింది. కాణిపాకం దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యులుగా వీరు వున్నప్పటికీ వారి నియోజకవర్గాల పరిధిలో జనసేన పార్టీని బలోపేతం చేయడంలో వారి పాత్ర సైతం పరిమితంగా వుంటోంది. నగరి అసెంబ్లీ నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీగా న్యాయవాది మహేష్ పలు ఛానళ్ళలో జనసేన గొంతు వినిపిస్తున్నప్పటికీ ఆయనకు సైతం కూటమి ప్రభుత్వం ఎలాంటి పదవి కట్టబెట్టలేదు. జిడినెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీ డాక్టర్ యుగంధర్ పొన్నాకు మాల కార్పొరేషన్ డైరెక్టర్ పదవి కట్టబెట్టడంతో ఆయన మాత్రం నియోజకవర్గ పరిధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. అలాగే పలమనేరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీ దిలీప్ సైతం కూటమి ప్రభుత్వంలో అధికారంకు దూరంగా వుంటున్నారు. చిత్తూరు జిల్లా జనసేన పార్టీలో జిడినెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా వున్న ఒక్క డాక్టర్ యుగంధర్ పొన్నా మినహా మిగిలిన వారందరు పార్టీలో నామమాత్రంగా వుండే పరిస్థితి ఏర్పడింది. జిడినెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీ తనకు వున్న అధికారంను అడ్డుపెట్టుకుని కొంతమంది అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వున్నాయి. ఈ పరిస్థితుల్లో చిత్తూరు జిల్లాలో ఎవరినైనా బలమైనే జనసేన పార్టీ నేతను నియమించి అతని ఆధ్వర్యంలో జిల్లాలో జనసేన పార్టీని బలోపేతం చేయడానికి పునుకోవాలని కార్యకర్తలు కోరుకుంటున్నారు. అయితే జనసేన పార్టీ అధినాయకత్వం మాత్రం చిత్తూరు జిల్లాకు ప్రత్యేకంగా ఒక అధికార కేంద్రం ఇవ్వడానికి సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలో భవిష్యత్తులో జనసేన పార్టీ భవిష్యత్తు ఏమిటనే విషయంపై జనసేన నాయకులు, కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది.

# స్విమ్స్‌రేడియాలజి విభాగం ఆధ్వర్యంలో మిడ్ టెర్మ్ కాన్ఫిరెన్స్ - 2026 విజయవంతం

## - వ్యాధిని నిర్ధారించడానికి రేడియాలజిస్టులు పాత్ర చాలా కీలకం - టిటిడి పాలకమండలి సభ్యులు వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి

తిరుపతి హెల్త్, మార్చి 15, ప్రభాతవార్త

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) రేడియాలజి విభాగం, బ్రీస్ట్ ఇమేజింగ్ సొసైటీ అఫ్ ఇండియా వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో బేసిక్స్ టూ అడ్వాన్సస్ ఇన్ బ్రీస్ట్ ఇమేజింగ్ అనే అంశంపై రేడియాలజి కాన్ఫిరెన్స్‌ను విజయ వంతంగా నిర్వహించినట్లు ఇంచార్జీ మెడికల్ సూపరిటెండెంట్ డా. కోటిరెడ్డి తెలియజేశారు. అందులో బాగంగా మొదటి రోజు మార్చి 14వ తేది స్విమ్స్ రేడియాలజి విభాగం అల్ట్రాసౌండ్ బ్లాక్ నందు హాండ్స్ ఆన్ వర్క్‌షాప్ ఇన్ బేసిక్ ఇంటర్వెన్షన్స్ అనే అంశంపై వర్క్ షాపు నిర్వహించారు. రెండవరోజు ఆదివారం శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు వివిధ అంశాలపై దేశం నలుమూలల నుండి నిష్ణాతులైన రేడియాలజి వైద్యులు పాల్గొని వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమావేశం నిర్వహించారని తెలిపారు. ముఖ్య అతిథిగా టిటిడి పాలకమండలి సభ్యులు, స్విమ్స్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, గౌరవ అతిథిలుగా, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్, ఎ.పి.యం.సి ఛైర్మన్, ఐ.ఆర్.ఐ.ఎ. ప్రెసిడెంట్ డా. హరి రావు, డీన్ డా. అలోక్ సచన్, డా. బాలానాద్, డా. జ్వాలా శ్రీకళ, ఆర్గనైజింగ్ ఛైర్మన్ డా. బి. విజయలక్ష్మి దేవి. ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. శిల్ప కడియాల, డా. ఉమామహేశ్వర రెడ్డి. ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ డా. సాయి క్రిష్ణ తిరుపతి సీనియర్ రేడియాలజిస్ట్ డా నసీరుద్దీన్ లు సంయుక్తంగా జ్యోతిని సమావేశాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ మాట్లాడుతూ రొమ్ము వ్యాధుల నిర్ధారణ, స్క్రీనింగ్, చికిత్స ప్రణాళికను మెరుగుపరచడానికి స్విమ్స్ రేడియాలజీ విభాగంలో పరీక్షలు చేస్తున్నారని, అలాగే మారుమూల మహిళల కోసం ప్రత్యేకంగా స్విమ్స్ వారిచే పింక్ బస్ ద్వారా క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక వైద్య శిభిరాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే పింక్ బస్ 2018 నుండి మహిళలకు, ముఖ్యంగా గ్రామీణ మరియు వెనుకబడిన ప్రాంతాలలో రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను అందిస్తుందని. అలాగే స్విమ్స్ హాస్పిటల్ కు వి.పి.ఆర్ ఫౌండేషన్ ద్వారా 2025 ఫిబ్రవరి 4న కొత్త క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ బస్ ను అందించినట్లు తెలియజేశారు. ఎపి.యం.సి ఛైర్మన్, ఐ.ఆర్.ఐ.ఎ. ప్రెసిడెంట్ డా. హరిరావు మాట్లాడుతూ క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నదున ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య శిభిరాలు ఏర్పాటు చేస్తున్నారని తెలియజేశారు. ఆర్గనైజింగ్ ఛైర్మన్, రేడియాలజీ విభాగాధిపతి డా. బి. విజయలక్ష్మి దేవి మాట్లాడుతూ తి.తి.దే వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్స్ హాస్పిటల్ నందు మామోగ్రామ్, అల్ట్రాసోనోగ్రఫి, బ్రెస్ట్ యం.ఆర్.ఐ మరియు పెట్ సిటి వంటి అత్యాధునిక ఇమేజింగ్ సౌకర్యాలు స్విమ్స్ నందు ఉన్నాయని, మహిళలు క్యాన్సర్ పై అవగాహన పెంచుకొని ముందస్తుగా పరీక్షలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుండి దాదాపు 200 మంది డెలిగేట్స్ (ప్రతినిధులు), రేడియాలజిస్టులు పాల్గొని తమ వివిధ అంశాలపై చర్చించుకొన్నారు. పాలక మండలి సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని, అతిథులను సిమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్ వి కుమార్ శాలవతో సన్మానించి జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ రేడియాలజి, అంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాధిపతులు, వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.




# పడిపోయిన కోడిగుడ్ల ధరలు

## డజను కేవలం 40 రూపాయలే

పలమనేరు, మార్చి 15, ప్రభాతవార్త:

ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధం మన దేశంలో వివిధ రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఓ వైపు ఇరాన్ నుండి దిగుమతి అయ్యే వంట గ్యాస్, ఇంధనం ఇతర ఆయిల్ ధరలు ఆకాశాన్నంటుతుండగా మరో వైపు మనదేశం నుండి ఇరాన్‌తో పాటు గల్ఫ్ దేశాలకు ఎగుమతి అయ్యే కోడిగుడ్ల ధరలు పతనమయ్యాయి. సముద్రమార్గం నుండి వెళ్ళే కోడిగుడ్లు సరఫరా నిలిచిపోయాయి. తమిళనాడు, కర్నాటక నుండి ప్రతిరోజూ పెద్దమొత్తంలో దాదాపు వెయ్యి మిలియన్ల వరకు గుడ్లు ఎగుమతి అవుతుంటాయి. కోడిగుడ్లు ఎక్కడి వక్కడ నిలిచిపోవడం వారం రోజుల కంటే ఎక్కువ నిల్వ వుండక పోవడంతో గుడ్లు దుకాణాల్లో మురిగిపోతున్నాయి. ఈ ప్రభావం పలమనేరులోనూ కోడిగుడ్లు ధరలపై కూడా పడింది. ధరలు తగ్గినా ఉత్పత్తి మాత్రం తగ్గక పోవడంతో ఇదినిల్వలకు దారితీస్తోంది. ఈ పరిస్థితిలో డజను గుడ్లు గతంలో రూ.80 వరకు ధర ఉండగా నేడు కేవలం రూ.40కి పడిపోయాయి. అంటే మార్కెట్ ధర రూ.3.50కి పడిపోవడంతో సగానికి సగం ధర పడిపోవడంతో నష్టం వాటిల్లుతోంది. నష్టాలు భరించలేక ఓ వైపు కోళ్ళ రైతులు, మరో వైపు కోడిగుడ్ల వ్యాపారులు లబోదిబో మంటున్నారు. పలమనేరు, బైరెడ్డిపల్లె, గంగవరం, పెద్దపంజాణి, వి.కోట మండలాలతో పాటు దేశంలోని ప్రధాన రాష్ట్రాలతో పాటు కర్నాటక, కేరళ తదితర రాష్ట్రాల నుండి కోడిగుడ్లు కేరళ, చెన్నై సముద్రతీరాల నుండి ఇరాన్‌కు సరఫరా అవుతుంటాయి. గతంలో స్థానికంగానూ డిమాండ్‌ను బట్టి కోడిగుడ్ల ధరలు కొంతవరకు పెరగడం తగ్గడం జరిగేది. ఐతే ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా ధరలు పడిపోవడంతో దుకాణాల్లో డజను రూ.40 వంతున విక్రయిస్తున్నారు. ఓ వైపు చికెన్ ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. బ్రాయిలర్ లేదా లింగాపురం కేజీ రూ.280 నుండి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. ఐతే చికెన్ ధరలు అధికంగా వున్న సమయంలో గుడ్ల ధరలు తగ్గిపోవడంతో వినియోగదారులు కొంత వరకు ఉపశమనం పొందుతున్నారు. జాతీయ గుడ్ల సమన్వయ కమిటీ అందించిన డేటా ప్రకారం గత కొన్ని రోజులుగా గుడ్డుధర పతనమైంది.